గురువులు

వచన

సద్గురు మలయాళస్వామి


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్థం TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ లో eBOOK(PDF) అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంధాలయం ఉండాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)


http://ebooks.tirumala.org



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


T.T.D. Religious Publications Series No.910
Price :

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

“బ్రహ్మ మొక్కటే” గ్రంథమాల

శ్రీ సద్గురు మలయాళస్వామి

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

"బ్రహ్మ మొక్కటే" గ్రంథమాల

శ్రీ సద్గురు మలయాళస్వామి

రచన

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2012

SRI SADGURU MALAYALASWAMY

By
Dr. Samudrala Lakshmanaiah

T.T.D. Religious Publications Series No. 910

First Edition : 2012

Copies : 3000

Published by
L.V. SUBRAHMANYAM, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

D.T.P.
Editor in Chief Office,
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖలను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతండా॥ సముద్రాల లక్ష్మణయ్యగారురచించిన **"శ్రీ సద్గురు మలయాళస్వామి"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

సదా శ్రీవారి సేవలో....

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

విషయసూచిక

శ్రీ సద్గురు మలయాళస్వామి

ప్రథమ ప్రకరణం

జననం - బాల్యం

ప్రకృతిసుందరమైన కేరళభూమిని మలయాళదేశం అని కూడా వ్యవహరిస్తారు. అద్వైత వేదాంత జ్ఞాన భిక్షా ప్రదాత శ్రీ శంకర భగవత్పాదుల జన్మదేశ మది. "ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు" అన్న దివ్య ప్రబోధంతో మానవాళికి చైతన్యం చేకూర్చిన శ్రీనారాయణ గురుదేవులు కూడా అక్కడే జన్మించారు.

ఆంధ్రదేశంలోని తిరుపతి లాగా కేరళలోని గురువాయూరు మిక్కిలి ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం. నిత్యమూ వేలకొలది భక్తుల రాకపోకలతో సందడిగా ఉండే క్షేత్రమది. అక్కడికి సమీపంలోనే 'ఎన్గండ్యూరు' అనే ఒక గ్రామం వున్నది. ఆ ఊరిలో కరియప్ప అనే సదాచార సంపన్నుడైన గృహస్థుడు ఉండేవాడు. ఆయన ధర్మపత్ని పేరు నొట్టియమ్మ. వారిది మధ్యతరగతి కుటుంబం. భగవద్భక్తి, అతిథిసేవ వారికి ఆనువంశికంగా వచ్చిన మహాలక్షణాలు.

క్రీస్తుశకం 1885 మార్చి 27వ తేదీన గురువారం నాడు నొట్టియమ్మ ముద్దులు మూటగట్టే ఒక మగబిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డకు 'వేలప్ప' అని నామకరణం చేసి తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచారు. తల్లి శిశువును సత్ప్రవర్తనతో తీర్చిదిద్దడంలో ఎంతో నేర్పూ, ఓర్పూ చూపింది.

పూవు పుట్టగానే తావి ప్రసరిస్తుంది. అలాగే వేలప్ప మహనీయుడుగా రూపొందనున్నాడని సూచించే సంఘటనలు కొన్ని అతని చిన్నతనంలోనే జరిగాయి.

మెత్తని ప్రక్కపై పరుండబెడితే ఆ బాలుడు నిద్రించేవాడు కాడు. ప్రక్కనుండి క్రిందికి జరిగి కటికనేలపై నిద్రించేవాడు. ఎందుకిలా జరుగుతున్నదో తెలుసుకొందామని తల్లి ఒక బైరాగితో ఈ విషయం చెప్పింది. అతడు బాలునివైపు తేరిపార చూచి "అమ్మా! ఈ బిడ్డ సర్వ సంగపరిత్యాగి కానున్నాడు" అని చెప్పాడు.

వేలప్ప జాతకం చూచిన జ్యోతిషికులు "ఇతనిది గుమ్మడితీగ జాతకం. ఇతడు పెద్దవాడై గుమ్మడి తీగలాగా జన్మస్థానం వదలి చాలా దూరం వెళతాడు. ఆ తీగ సుదూరంలో పుష్పించి ఫలించినట్లే అక్కడ ఇతడు మహాకార్యాలు నిర్వర్తిస్తాడు" అని వివరించారు. అది విన్న తల్లిదండ్రుల కన్నులనుండి సుఖ దుఃఖమిశ్రితాలైన అశ్రువులు జాలువారాయి.

అతనికి ఐదేళ్ళప్రాయంలో అక్షరాభ్యాసం జరిగింది. విద్యాభ్యాసంతో పాటు భగవత్పూజ, భజన, ధ్యానం అతని నిత్యకృత్యా లయ్యాయి. అతడు బడికి పోయే దారిలో కూడా చదువుతూనే పోయేవాడు. చదువవలసిన పాఠాలే కాక గ్రంథమంతా కంఠస్థం చేసుకొనేవాడు. ధ్యాన నిమగ్నుడైనప్పుడు భోజనానికి గూడా లేచేవాడు కాడు. పాఠ్యభాగం కంఠస్థమయ్యే వరకూ రాత్రివేళ ఆహారం ముట్టడు. నియమం పాటించకపోతే శ్రేయస్సు లేదు అన్న సూక్తిని చిరుతప్రాయంలోనే అతడు ఆచరణకు తెచ్చుకొన్నాడు. ఏకాదశి, మాస శివరాత్రి, సోమవారం మొదలైన దినాలలో క్రమం తప్పక ఉపవాసవ్రతం పాటిస్తూ వచ్చాడు.

భూతదయ

ఒకనాటి సాయంకాలం వేలప్ప బడినుండి ఇంటికి వస్తున్నాడు. దారిలో ఒక బోయడు రెండు పక్షులను అమ్మజూపుతున్న దృశ్యం అతని కంటబడింది.

వాటి వెల అడిగి తెలుసుకొన్నాడు. వెనువెంటనే ఒక్క పరుగుతో తల్లివద్దకు వెళ్లాడు. తల్లినడిగి పైకం తెచ్చి బోయవానికి ముట్టజెప్పాడు. పక్షులను తన వశం చేసుకొని ఆకాశంలోకి ఎగురవేశాడు. అది చూచిన పిన్నలూ, పెద్దలూ భూతదయామయమైన అతని చేష్టకు ఆశ్చర్యచకితు లయ్యారు. సంగతి తెలుసుకొన్న నొట్టియమ్మ ప్రియంగా కుమారుణ్ణి కౌగిలించుకొని "నాయనా! సదా ఇట్లే జీవకారుణ్యం కలిగి జీవించు" అని ఆశీర్వదించింది.

ఈ సంఘటన పూర్వం దేవదత్తుని బాణంతో నేలగూలిన హంసను కాపాడిన బుద్ధదేవుని స్మరణకు దెస్తున్నది. "దయగల హృదయమే భగవన్నిలయం" అని భావికాలంలో భక్తులకు బోధించిన వేలప్ప చిన్ననాటనే ఈ సూక్తికి తాను నిదర్శన మయ్యాడు.

శుష్కవేదాంతి బహిష్కారం

ఒకనాడు ఒక బైరాగి ఎన్గండ్యూరికి వచ్చాడు. సహజంగా సాధువుల పట్ల గౌరవం చూపే ఆ ఊరివారు అతణ్ణి ఘనంగా ఆదరించారు. అతడు వారితో ఇలా అన్నాడు...

"నేను కాశి నుండి వచ్చాను. తపోమహిమ వల్ల అనేక దివ్యసిద్ధులు పొంది వున్నాను. నా చేత నున్న ఈ రుద్రాక్షమాల మా గురువుగారు నాకు ప్రసాదించారు. దీని ప్రభావం చాలా గొప్పది. ఉదయం ఒకసారి, సాయం సమయంలో ఒకసారి ఈ మాలను ముద్దచేసి పిండితే ఇందుండి గంగాజలం స్రవిస్తుంది. ఆ జలం ఒక్క బిందువు సేవించినా చాలు, మీ పాపాలన్నీ పటాపంచ లవుతాయి. ఒక చెంచా నీటి వెల ఒక్క రూపాయి మాత్రమే".

అప్పటికి వేలప్పకు పట్టుమని పదేళ్లు కూడా లేవు. బైరాగి చూపిన రుద్రాక్షమాల పట్ల అతనికి సంశయం కల్గింది. అందలి సత్యాసత్యాలు

తేల్చుకోవాలని నిశ్చయించుకొన్నాడు. పరిచర్యావ్యాజంతో బైరాగికి సన్నిహితు డయ్యాడు. తగిన కాలానికై ప్రతీక్షించాడు. సాధువు స్నానానికి పోయిన సమయంలో అతని గదినంతా పరికించాడు. ఒకమూల పెట్టెలో భద్రంగా దాచబడివున్న రుద్రాక్ష మాలను చూశాడు. దానిని తాకి చూచేసరికి అందలి రహస్యం అతనికి బోధపడింది.

అది జీలుగు బెండు వంటి ఏదో మెత్తని పదార్థంతో తయారయిన మోసపు రుద్రాక్షమాల. నీటిలో ముంచినపుడు తగినంత నీరు పీల్చుకొంటుంది. వేలప్ప ఈ రహస్యం పెద్దల చెవికి చేరవేశాడు. గుట్టు రట్టు కావడంతో కపట సాధువును గ్రామస్థులు తరిమివేశారు. పిల్లవాని పరిశీలనా దృష్టిని ఎంతో మెచ్చుకొన్నారు. శుష్కవేదాంతుల కపట నాటకాల రహస్యాన్ని ఛేదించడం వేలప్పకు వెన్నతో పెట్టిన విద్య.

ధ్యాననిష్ఠ

శ్రావణమాసంలో ఒకనాటి సాయంకాలం వేలప్ప ఇంటి వెలుపల వున్న కుటీరంలో ధ్యాననిమగ్నుడై వున్నాడు. ఎంతసేపటికీ వెలికి రాలేదు. అత డక్కడ వ్యర్థంగా కాలం గడుపుతున్నా డని అతని అన్న భావించాడు. పరుషంగా మాట్లాడుతూ కుటీరంలోకి వెళ్ళి అతని చెంపపై ఛెళ్ళుమని ఒక దెబ్బ కొట్టాడు.

అయినా వేలప్ప నిష్ఠనుండి చలించలేదు. అన్నకు కోపం ద్విగుణీకృత మయింది. మళ్లీ బెదరించడానికి లోపలికి పోబోయాడు. కాని కుటీర ద్వారానికి అడ్డంగా తెల్లనైన ఒక మహానంది పరుండివున్నట్లు చూచి భయంతో వెనుకకు మళ్లాడు. తాను చూచిన దృశ్యాన్ని ఇంటివారికి చెప్పాడు.

తల్లి వచ్చి చూచేసరికి నంది కనిపించలేదు. వేలప్ప నడిగితే తనకేమీ తెలియదని చెప్పాడు. అతని ధ్యాననిష్ఠకు నాటినుండి ఎవరూ ఆటంకం కల్గించలేదు. దైవమే అతని కలా సహాయపడింది.

కేరళలో పూర్వంనుండీ సంస్కృత విద్య బహుళవ్యాప్తిలో వుండేది. వేలప్ప విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లో ఆంగ్లభాష వ్యాప్తికి వచ్చింది. అతనికి ఆంగ్లం నేర్పించాలని పెద్దలు నిశ్చయించారు. కాని ఆ బాలుడు "నేను సంస్కృతమే చదువుకుంటాను" అని తెగవేసి చెప్పడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. మాతృభాషతో పాటు ఆధ్యాత్మవిద్యకు ఆలవాలమైన సంస్కృతంలో కూడా పరిశ్రమించి వేలప్ప ఆత్మోన్నతి సాధించాడు.

శ్రీనారాయణ గురువు

ఆ దినాలలో కేరళ దేశంలో ఆధ్యాత్మికంగానూ, సామాజికంగానూ అపూర్వమైన క్రాంతి కల్గించిన మహాత్ము డొకడు ఉండేవాడు. ఆయనే శ్రీనారాయణ గురువు. 1854 లో తిరువనంతపురానికి సమీపంలోని ఒక గ్రామంలో ఆయన జన్మించాడు. సంస్కృత వాఙ్మయాన్ని కూలంకషంగా అభ్యసించాడు. సత్యాన్వేషణ తత్పరుడై దేశాటన చేశాడు. యోగి పుంగవుల నాశ్రయించి యోగవిద్యలో నిష్ణాతుడయ్యాడు. చివరికి ఏకాంతంగా చిరకాలం తపోనిష్ఠలో ఉండి ఆత్మసాక్షాత్కారం పొందాడు.

మలయాళదేశంలో ఆ కాలపు పరిస్థితులు మిక్కిలి దారుణంగా వుండేవి. నిమ్న జాతీయులు పశువులకంటే హీనంగా బ్రదికేవారు. నిమ్నోన్నత భేదాలతో కూడిన హిందూ సమాజంలో గౌరవంగా జీవించలేక చాలామంది దళితులు ఇతర మతాలలో ప్రవేశించారు. మానవ సంఘమంతా ఛిన్నాభిన్నమై అజ్ఞానగ్రస్తమై అస్తవ్యస్తంగా వుండింది.

భారతజాతిని పట్టి పీడిస్తూ వుండిన ఈ జాడ్యాన్ని హతమార్చడానికి నారాయణ గురుదేవులు పూనుకొన్నారు. అస్పృశ్యత, జంతుబలులు, మద్యపానం, కులమతద్వేషాలు మొదలైన దురాచారాలనూ, దుర్గుణాలనూ రూపుమాపడానికి ఆయన తీవ్రస్థాయిలో ఉద్యమించారు. సర్వజనులలోనూ సోదరభావం నెలకొల్పడానికి అపూర్వకృషి గావించారు. ప్రజోపయోగకరమైన విద్యాలయాది సంస్థలను పెక్కింటిని స్థాపించారు.

వారి ఉద్యమంవల్ల వెనుకబడిన ప్రజల్లో కొంగ్రొత్త చైతన్యం వెల్లివిరిసింది. గాంధీ మహాత్ముడు, రవీంద్రనాథటాగూరు వంటి మహనీయులు శ్రీనారాయణ గురువును సందర్శించి ఆయన కొనసాగించే లోకోద్ధారక కార్యక్రమాలను ఎంతో ప్రశంసించారు.

“ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం” అని ఎలుగెత్తి చాటిన శ్రీనారాయణ గురుదేవులు నేటికీ కేరళలో లక్షలకొలది ప్రజలకు ఆరాధ్య దైవమై విలసిల్లుతున్నారు.

ఆ గురుదేవుని అనుగ్రహం వల్ల ఆయన శిష్యులనేకులు అనేక రంగాలలో పురోగమించారు. వారిలో అగ్రగణ్యులు శ్రీ సిద్ధశివలింగ గురుస్వామి. ఈయన ఎర్నండ్యూరికి సమీపంలో పెరింగోట్కర గ్రామం వద్ద శ్రీనారాయణాశ్రమం అన్న పేరుతో ఒక ఆశ్రమం స్థాపించారు. ఆధ్యాత్మిక భావ ప్రచారానికి తన జీవితం అంకితం చేసిన శివలింగ గురువు ఒక ఆదర్శప్రాయమైన బ్రహ్మవిద్యాకేంద్రంగా ఆశ్రమాన్ని రూపొందించారు.

గురుకులవాసం

ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన వేలప్ప తల్లిదండ్రుల అనుమతితో నారాయణాశ్రమం చేరుకున్నాడు. శివలింగ గురుని సన్నిధిలో సంస్కృతం

అభ్యసిస్తూ చక్కని క్రమశిక్షణతో ప్రవర్తించాడు. ‘సర్వజన సౌభ్రాత్రం’ అనే పునాదిపై స్థిరపడిన ఆ ఆశ్రమంలో విద్యాభ్యాసం అతని పురోగమనానికి ఎంతగానో సహకరించింది.

అతడు ఆశ్రమ నిత్య కార్యక్రమాలలో శ్రద్ధతో పాల్గొంటూ గీర్వాణవాణి నభ్యసించాడు. ప్రారంభదశలో శబ్దమంజరిలోని శబ్దాలను కంఠస్థం చేయడంలోని క్లేశం వల్ల ఒకటి రెండు సార్లు పుస్తకాన్ని ఆవల పారవైచి ధ్యాన నిమగ్నుడయ్యాడు.అయినా విద్యావంతుడు కావాలన్న పట్టుదలతో మళ్ళీ పుస్తకం చేతికి తీసుకొన్నాడు. అక్షయ దీక్షతో రేయింబవళ్లు చదివి పదమూడు దినాలలో శబ్దమంజరిని కంఠస్థం చేసుకొన్నాడు. అక్షయదీక్షాదక్షునికి అసాధ్యమైన దేమున్నది?

పూజాదికాలు చేస్తున్నా అతడు చదువుపట్ల అశ్రద్ధ వహించలేదు. గురుకుల వాసకాలంలో తన చదువును, ధ్యానమును గురించి తరువాతి కాలంలో ఆయన చెప్పిన ఈ క్రింది మాటలు ఇక్కడ గమనింపదగి వున్నాయి.

“ఏ రోజు పాఠము ఆ రోజు పూర్తిగా వల్లించిన పిదపనే ఆ రాత్రి భోజనమునకు వెళ్లువాడను. ఉదయమున గూడ పూజాది కార్యములు సమాప్తి గావించుకొనిన పిమ్మట పాఠమునకు పోయి చిన్నవారికి నేనును పాఠము చెప్పి మరల ధ్యానము చేసిన పిమ్మటనే భుజించు స్వభావము గల్గియుంటిని. చిన్నతనమునుండి ధ్యానమునందే నాకెక్కువ ప్రీతి యుండెడిది. ధ్యానమైన తర్వాతనే భుజించెడి స్వభావము కలదు. కనుక ఒక్కొక్కప్పుడు రాత్రులందు పండ్రెండు లేక ఒంటిగంటకు భోజనము సల్పిన రోజు లెన్నియో గలవు. ఒక్కొక్కప్పుడు ధ్యానము పూర్తి యగుసరికి తెల్లవారెడిది. వేడి యెక్కువై నిద్ర వచ్చునేమో యని శిరస్సుపై అప్పుడప్పుడు చన్నీళ్ళతో తడిపిన వస్త్రము పెట్టుకొని ధ్యానము సల్పితిని.”

"నేను గూడా మీ మాదిరి మనిషినే. పరిశ్రమ మాత్రమే నన్ను ఈ స్థితికి తెచ్చినది. రోజుకు ఇరువది యైదు శ్లోకములు కంఠస్థము చేసిన రోజు లున్నవి."

వేలప్ప గురుకులవాసం ఇలా కొనసాగింది. తాను చదివే పుస్తకాలలో ఎక్కడైనా మహర్షుల ఆశ్రమాల వర్ణన, తపశ్చర్యాప్రస్తావన వస్తే అతడు ఏదో అపూర్వమైన అనుభూతి పొందేవాడు. రఘువంశంలోని వసిష్ఠాశ్రమ వర్ణన, కుమార సంభవంలో పార్వతీ తపశ్చర్య అతణ్ణి అమితంగా ఆకర్షించాయి. అలాంటి స్థితి తనకెప్పుడు కల్గుతుందో అని అతడు తహతహపడేవాడు.

వస్త్రశుద్ధి, స్థలశుద్ధి, పాత్రశుద్ధి, కాయశుద్ధి, వాక్‌శుద్ధి అనేవి పంచశుద్ధులు. ఆహార నియమం, ధ్యాన నియమం, నివాస నియమం, మనోనియమం, కార్యనియమం అనేవి పంచ నియమాలు. ఈ శుద్ధులనూ, నియమాలనూ వేలప్ప ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా పాలించేవాడు.

ఒకనా డెందుకో తోటి బ్రహ్మచారిని దూషించవలసి వచ్చిందట! దూషించిన తర్వాత వాక్ శుద్ధికి భంగం కల్గిందని పశ్చాత్తాపం పొందాడు. దానితో ఆగక తప్పు చేసిన నాలుకపై వాత వేసుకొన్నాడు. ప్రవర్తనలో తప్పిదం సంభవిస్తే అతడు తనకు తానే ఉపవాస శిక్ష విధించుకొనేవాడు.

మంత్రోపదేశం

సత్కర్మానుష్ఠానంతో శుద్ధుడైన శిష్యుణ్ణి చూచి శివలింగ గురుస్వామి సుప్రసన్నులు, సుప్రీతు లయ్యారు. ఒక శుభదినాన అతనికి మంత్రోపదేశం చేశారు. యమనియమాదికమైన అష్టాంగయోగం బోధించారు. ప్రణవోపాసన ఉపదేశించారు. వేలప్ప అన్నింటినీ భక్తి శ్రద్ధలతో అనుష్ఠించాడు. మూర్తి పూజలతోపాటు మానస పూజను కూడా నెరవేర్చాడు.

గీత, ఉపనిషత్తులు, యోగవాసిష్ఠం మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలలో అతనికి అమితమైన అభిరుచి కల్గింది. సాధన సంపత్తితో పురోగమించిన శిష్యరత్నానికి శివలింగ గురుస్వామి ఒకనాడు మహావాక్యాలు గూడా ఉపదేశించారు. వాటిని మననం చేసి నిదిధ్యాసం చేయవలసిందిగా ప్రబోధించారు. గురునిర్దిష్ట మార్గంలో వేలప్ప ముందుకు సాగిపోయాడు.

శ్రీ నారాయణ గురుదేవుల యశశ్చంద్రికలు నేలనాలుగు చెరగులా విస్తరిస్తుండిన రోజులవి. ఒకసారి శివలింగగురుని అనుమతితో పయనమైపోయి వేలప్ప నారాయణ గురుదేవుని సందర్శించి సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆ గురూత్తముడు ఈ వటూత్తముని యోగ్యత గుర్తించి త్వరలో నీకు బ్రహ్మానుభవం సిద్ధింపనున్నది అని ఆశీర్వదించారు. వేలప్ప ధన్యోఽస్మి అనుకుంటూ గురుకులానికి తిరిగి వచ్చాడు.

భారతావనిలోని పవిత్ర తీర్థస్థలాలనూ, లోకోద్ధారకులైన మహాత్ములు స్థాపించిన సంస్థలనూ సందర్శించాలని అతనికి తీవ్రమైన కోరిక కలిగింది. ఇంతలో తన తల్లి రోగగ్రస్తురాలై యున్నదన్న వార్త అతని చెవి సోకింది. గురుని అనుమతితో వెంటనే ఎన్నందుర్యారికి బయలుదేరాడు. అటనుండి తీర్థయాత్రకు వెళ్తానని కూడా గురువుకు నివేదించాడు.

శ్రీ శివలింగ గురుస్వామి అందుకు సమ్మతించి "నాయనా! నీవు ఎక్కడికి వెళ్లినా ప్రయత్నంతో బ్రహ్మచర్యాన్నీ, అహింసనూ, సత్యాన్నీ, అపరిగ్రహ వ్రతాన్నీ ఏమరుపాటు లేకుండా కాపాడుకో. సమస్త ప్రాణులనూ సమదృష్టితో చూడు. నీ హృదయంలో కాపట్యానికి అవకాశం ఇవ్వవద్దు" అని ఉపదేశించి ఆశీర్వదించారు.

వేలప్ప నాటి సాయం సమయానికి ఎన్నందుర్యారు చేరి మాతృ సేవాపరాయణు డయ్యాడు.

ద్వితీయ ప్రకరణం
తీర్థయాత్ర

భక్తి శ్రద్ధలతో వేలప్ప చేసిన పరిచర్యలు తల్లికి అచిరకాలంలోనే ఆరోగ్యం చేకూర్చాయి. అత డిప్పుడు తీర్థయాత్రను గూర్చి ఆలోచించసాగాడు.

"బుద్ధుడు, శంకరుడు, ఏసుక్రీస్తు, మహమ్మదు, గురునానక్" మొదలైన మహనీయు లందరూ త్యాగం వల్లనే అమరు లయ్యారు. "త్యాగేనైకే అమృతత్వ మానశుః" అని శ్రుతి. జీవుడు తన్ను దేవునకు సమర్పించు కొన్నప్పుడే అమృతత్వం పొందగలడు. లేకపోతే జన్మవ్యాధి జరాది దుఃఖాలు తప్పవు. నేను ఇల్లు వదలి విశాల ప్రపంచంలో అడుగు పెట్టి సత్యాన్వేషణతత్పరుడ నవుతాను. సమస్తభారతభూమినీ పర్యటించి జీవితలక్ష్యం సాధిస్తాను".

ఇలా ఆలోచిస్తూ పదునెన్మిదేండ్ల ప్రాయంవాడైన వేలప్ప ఒకనాటి అర్ధరాత్రి వేళ ఇల్లు వదలాడు. పాదచారంతో భారత పర్యటనకు ఉపక్రమించాడు. మరునాటి ఉదయం అతని కుటీరంలో ఈక్రింది ఉత్తరం కనిపించింది.

"దైవాత్మ స్వరూపులైన జననీ జనకులారా! నా కొరకై మీరు చింతించవద్దు. నన్ను వెదుక నవసరం లేదు. వెదకినా దొరకను. ఇంటికి వచ్చిన అతిథులకు మీరు ఎంతకాలం అన్నపానాదులు ఇచ్చి ఆదరిస్తారో, అంతవరకూ నాకు సర్వేశ్వరుడు ఏ కొరతా రానీడు. నేను దైవ కార్యార్థం వెళుతున్నాను".

కుమారుడు అదృశ్యుడు కావడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. జాతకఫలం తప్పలేదని బంధువులు విస్తుపోయారు.

"అతడు దైవాంశ సంభూతుడు. అతనికై చింతించవలదు" అని విజ్ఞులు ఇంటివారి నోదార్చారు. వేలప్ప కోరినట్లే ఇంటికి వచ్చిన అతిథుల నాదరిస్తూ తల్లి నొట్టియమ్మ కాలం గడపింది.

బుద్ధుని లాగా ఇల్లు వదలిన వేలప్ప చకచక తన పయనం సాగించాడు. అతని జోలెలో భగవద్గీత, పాతంజలయోగదర్శనం, కఠోపనిషత్తు, జపమాల, విభూతి, వ్రాత కవసరమైన కాగితాలు, పెన్సిలు, ఒక చిన్న పాత్ర తప్ప మరేమీ లేదు.

ఆనాడు రైలు అందుబాటులో ఉన్నా అతడు కేవలం పాదయాత్రకే సిద్ధమయ్యాడు. ఎప్పుడు ఏది దొరకితే దానితో సంతుష్టి చెందుతూ ముందుకు సాగిపోయాడు. నిత్యము సుమారు ఇరవై మైళ్ళకు తక్కువ కాకుండా నడిచేవాడు. మధ్యలో ఎన్నో చిక్కులు ఎదుర్కొన్నాడు. అయినా "ప్రారబ్ధ ముత్తమగుణా న పరిత్యజంతి" అన్న సూక్తి ననుసరించి నిలవకుండా యాత్ర కొనసాగించాడు.

మిక్కిలి ముఖ్యమైన క్షేత్రాలలో మాత్రం రెండు, లేక మూడు దినాలు ఉండేవాడు. తక్కినచోట్ల ఉనికి ఒకపూట మాత్రమే. కర్ణాటకలో సుప్రసిద్ధాలైన ఉడిపి, సుబ్రహ్మణ్యం, ధర్మస్థలం, గోకర్ణం మొదలగు క్షేత్రాలను మొదట సందర్శించాడు. తన వద్ద ఉన్న ఇత్తడి పాత్ర దొంగల పాలవుతుందేమో అన్న సంకల్పం ధ్యానానికి భంగం కల్గించింది. అందువల్ల గోకర్ణంలో దానిని పారవైచాడు. ఆపై టెంకాయ బుర్రను పాత్రగా ఉపయోగించాడు.

కర్ణాటక భూమి దాటి మహారాష్ట్రంలో ప్రవేశించి పండరీపురానికి వెళ్లాడు. పిదప నర్మదా తీరంలో ఓంకారేశ్వరుణ్ణి సేవించాడు. అక్కడ నుండి

ద్వారక చేరుకున్నాడు. అక్కడి భక్తిమయ వాతావరణం అతణ్ణి తన్మయుణ్ణి చేసింది.

తరువాత పంజాబులో ప్రవేశించి అమృతసర్‌లోని స్వర్ణమందిరం సందర్శించాడు. మధ్యలో పావన ప్రదేశాలను పెక్కింటిని చూచాడు. చివరికి కాశ్మీరం చేరుకొన్నాడు. అచ్చటి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడయ్యాడు.

అతడు మధుర, బృందావనం, గోకులం మొదలైన దివ్యస్థలాలు దర్శించాడు. బృందావనం చేరడానికి ముందు ఒక యేరు దాటవలసి వచ్చింది. అతని చేత చిల్లిగవ్వ లేదు. నావికులు రూకలు లేనిదే పడవలో అడుగిడరా దన్నారు. బృందావనం చేరి తీరాలన్న దృఢసంకల్పంతో ఉన్న వేలప్ప తటాలున ఏటిలో దూకి ఈదసాగాడు. ప్రవాహపు టురవడి అతణ్ణి బలహీనుణ్ణి గావించింది. అందులో సుదూరం కొట్టుకుపోయాడు. అయినా పట్టు విడువక పోయి పోయి దైవ ప్రేరణతో చేతికి దగిలిన ఒక దుబ్బు పట్టుకొని ఆవలి గట్టు చేరాడు. కష్ట సమయంలో కల్గిన ఈ అనుభవం అతనికి మరింత ఉత్సాహం కలిగించింది.

బృందావనంలో కృష్ణభక్తిమయమైన వాతావరణం వేలప్పను పులకింపజేసింది. ఆపై అతడు కురుక్షేత్రం చేరి మూడుసార్లు గీతా పారాయణం చేశాడు. పిమ్మట హరిద్వారం చేరి అనేక మఠాలు సందర్శించాడు. ఆర్య సామాజికుల కన్యా గురుకులం అతణ్ణి విశేషంగా ఆకర్షించింది. వ్యాసాశ్రమంలో కన్యాగురుకుల స్థాపనకు అదే ప్రేరక మయిందని చెప్పవచ్చు. హిందూ సమాజంలోని అస్వతంత్రతను తొలగించి కులానికి గాక గుణానికి ప్రాధాన్య మిచ్చిన శ్రీ దయానందస్వామికి అతడు జోహారు లర్పించాడు.

తరువాత హృషీకేశం చేరి అక్కడి స్వర్గాశ్రమాది ప్రదేశాలను సందర్శించాడు. కాళీ కంబల్ బాబా త్యాగనిరతిని స్మరించాడు. హృషీకేశ్‌లోని ఆధ్యాత్మికత అతణ్ణి సంతుష్టుణ్ణి గావించింది. తదుపరి బదరికాశ్రమం చేరి అక్కడ బ్రహ్మ సూత్రాలను పారాయణం చేశాడు.

బ్రహ్మతర్పణం

బ్రహ్మకపాల తీర్థంలో స్నానానికి పోయినప్పుడు పురోహితులు సంకల్పం చెబుతామంటూ అతణ్ణి చుట్టుముట్టారు. అతడు "నాకు కావలసింది నిస్సంకల్పస్థితే కాని సంకల్పం కాదు" అని అన్నాడు. అప్పుడొక వృద్ధ పురోహితుడు "నీకు నిస్సంకల్పస్థితి కలిగేటట్లు సంకల్పం చెబుతాను" అంటూ సమీపించాడు. అందుకు వేలప్ప "అయ్యా! మీరు ఆచంద్రార్కం వంశాభివృద్ధిరస్తు! పుత్రపౌత్రాభివృద్ధిరస్తు!" అని సంకల్పం చెబుతారు. ఇది సిద్ధ క్షేత్రం కాన ఏది సంకల్పించినా నెరవేరుతుంది. నేను బ్రహ్మచారిని. నాకలా చెప్పవద్దు" అని అన్నాడు. అందుకు ఆ వృద్ధుడు "నాయనా! ఇది సిద్ధక్షేత్రమైనా ఇక్కడ ఆత్మశుద్ధి లేనివారి మాటలు ఫలించవు. అది కలవారి వాక్కులు ఇక్కడే కాదు. ఎక్కడైనా ఫలిస్తాయి" అని చెప్పాడు.

తరువాత వేలప్ప "లోకంలో సమస్త ప్రాణులు పరబ్రహ్మ గోత్రం నుండే ఉద్భవించారు. ఇక్కడ నేను వదిలే తర్పణం ప్రాణికోట్ల కన్నింటికీ చెందుగాక!" అంటూ తర్పణం వదిలాడు.

తిరుగు ప్రయాణంలో అతడు నైమిశారణ్యం మీదుగా అయోధ్యకు పయనించాడు. అక్కడ శ్రీ రామతారక మంత్రాన్ని లక్షసార్లు జపించాడు. తరువాత ప్రయాగకు పోయాడు. రామేశ్వరంలోని రామచంద్రమూర్తిని

అభిషేకించడానికై అక్కడ రెండు కాశికుప్పెలలో తీర్థం తీసుకొని భద్రపరచుకొన్నాడు.

ఆపై కాశీక్షేత్రం చేరుకున్నాడు. ఆ సుప్రసిద్ధ క్షేత్రంలో అనేక మఠాలు సందర్శించాడు. అందలి పండితుల ప్రజ్ఞా ప్రాభవాలు చూచి ఆశ్చర్యం చెందాడు. కాని కులానికున్న ప్రాముఖ్యం గుణానికి లేకపోవడం గమనించి విచారానికి లోనయ్యాడు. శివమంత్రాన్ని అక్షర లక్షలుగా జపించాడు. చాతుర్మాస్యకాలం అక్కడే గడిపాడు. అన్నపూర్ణా విశ్వనాథుల సందర్శనంతో ధన్యుడనయ్యా ననుకున్నాడు. అచ్చటి మఠాధిపతులు, మండలేశ్వరులు, విద్వాంసులు వేలప్ప అనుష్ఠాన నిష్ఠలను చూచి ఎంతగానో అభినందించారు.

అక్కడనుండి గయకు వెళ్లి వేద మంత్రోచ్చారణ పూర్వకంగా "నేనిచ్చే తర్పణం వల్ల పితృలోకం లోని జీవులందరికీ పుణ్యలోకప్రాప్తి కల్గుగాక!" అంటూ బ్రహ్మతర్పణం చేశాడు. తదుపరి బుద్ధగయకు వెళ్లి బుద్ధుడు తత్త్వదర్శనం చేసినచోట మూడు దినాలు ధ్యానం చేశాడు.

తర్వాత శ్రీకృష్ణచైతన్యస్వామి జన్మించిన నవద్వీపానికి వెళ్లి అక్కడ కలికల్మషనాశనమంత్రం జపిస్తూ భగవానుని భజించే భక్తులను చూచి ఆనందభరితు దయ్యాడు. పిదప కలకత్తా నగరం చేరి లోకభీకరమైన కాళీ విగ్రహాన్ని సందర్శించాడు. "తల్లీ! శాంతింపుము. ప్రళయకాలం ఇంకా రాలేదు. నీవు లోకమాతవు. ఉగ్రదృష్టిని ఉపసంహరించుకొమ్ము! శాంతదృష్టిని, కరుణాదృష్టిని, ప్రేమదృష్టిని ప్రసరింపజేయుము!" అని ప్రార్థించాడు.

పిమ్మట పూరీ జగన్నాథ క్షేత్రం చేరి అక్కడ వారం దినాలు గడిపాడు. అక్కడనుండి ఆంధ్రదేశంలో ప్రవేశించి సింహాచలం, భద్రాచలం, శ్రీశైలం

మొదలైన క్షేత్రాలు చూస్తూ తిరుమల వైపు పయనించాడు. తెలుగునేలలో సాధుజనులకు ఆశ్రయమిచ్చే పుణ్యాశ్రమాలు లేకపోవడం గమనించి విచారించాడు. భక్తి జ్ఞాన వైరాగ్య బీజాలను చల్లవలసిన అవసరం ఈ ప్రాంతంలో ఎంతైనా కలదని గ్రహించాడు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని దర్శించి పాపనాశనాది తీర్థాలను సేవించాడు. అక్కడి గోగర్భక్షేత్రం అతణ్ణి ఎంతో ఆకర్షించింది. యాత్రాకాలంలో తపోనిష్ఠ కనుకూలమైన ప్రదేశం ఎన్నుకోవాలని సంకల్పించుకొన్న అతనికి గోగర్భతీర్థస్థలం అనుకూలంగా తోచింది.

తాను చూడవలసిన క్షేత్రాలు దక్షిణదేశంలో ఇంకా మిగిలి వుండడం వల్ల యాత్ర పూర్తి చేసుకొని తిరుమలకు రాదలచుకొన్నాడు. పిమ్మట అరుణాచలం, కంచి, చిదంబరం శ్రీరంగం మొదలైన ప్రదేశాలు సందర్శించాడు. దక్షిణ దేశంలో దేవాలయాలు ఉన్నత స్థితిలో వున్నాయి. కాని ఉత్తరదేశంలో లాగా బ్రహ్మనిష్ఠులకూ, బ్రహ్మచారులకూ, పరివ్రాజకులకూ తగిన ఆధ్యాత్మిక కేంద్రాలు లేకపోవడం చూచి అతడు విచారగ్రస్తుడయ్యాడు.

తరువాత పళనికి వెళ్ళి తాను తెచ్చిన ఒక కుప్పెలోని గంగాతీర్థంతో శ్రీసుబ్రహ్మణ్యస్వామిని అభిషేకించాడు. మధురకు పోయి మీనాక్షీ సుందరేశ్వరులను దర్శించాడు. తదుపరి రామేశ్వరానికి వెళ్లి మరొక కుప్పెలోని భాగీరథీ తీర్థంతో శ్రీరామలింగేశ్వరస్వామిని అభిషేకించాడు. జన్మ సఫలమయిందని భావించాడు.

ద్వారక, బదరి, జగన్నాథం, రామేశ్వరం అనే చతుర్ధామాలను సందర్శించడంతో భారతమాతకు ఒక ప్రదక్షిణనమస్కారం చేసినట్లయింది.

అట నుండి కన్యాకుమారి, అనంతశయన క్షేత్రాల మీదుగా వరకల చేరి శ్రీనారాయణ గురుదేవుని పాదపద్మాలకు ప్రణమిల్లి వారి ఆశీర్వాదం పొందాడు. ఆపై శ్రీ శివలింగగురుని చెంతకు పోయి పాదాభివందనం చేసి వారి దీవనలు అందుకున్నాడు.

ఆపై ఎన్గండ్యూరు చేరి పుత్ర వియోగంతో క్రుంగి కృశించివున్న తల్లికి ప్రణమిల్లాడు. తండ్రి పరలోక గతుడయ్యాడని తెలిసికొని ఒకింత పరితపించాడు. తల్లికి పరిచర్యలు చేస్తూ అక్కడ కొంతకాలం నివసించాడు.

తదుపరి ఒకనాటి రాత్రి ఎవరికీ చెప్పకుండ తిరుపతి కభిముఖంగా పాదయాత్ర సాగించాడు. తిరుపతి చేరి సప్త జ్ఞాన భూమికల లాగా వున్న సప్తగిరులు ఎక్కి శ్రీవేంకటేశ్వరుణ్ణి సందర్శించాడు. ఈ విధంగా కారణ జన్ముడైన వేలప్ప 1913 డిసెంబరునెలలో తిరుమలలోని పావన గోగర్భతీర్థ ప్రదేశంలో ప్రవేశించాడు.

తృతీయ ప్రకరణం

తపోనిష్ఠ

దేశమంతా కాలినడకతో సంచరించడం వల్ల వేలప్పకు దేశ పరిస్థితులు చక్కగా గోచరించాయి. దేశంలో ఎక్కువశాతం ప్రజలు విద్యావిహీనులై పశుప్రాయులుగా జీవిస్తున్నారు. విద్యా విజ్ఞానాలు సామాన్య ప్రజానీకానికి అందుబాటులో లేకపోవడం వల్ల సమాజంలో అన్యాయాలూ, అక్రమాలూ విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. గుణకర్మలపై ఆధారపడి వుండవలసిన వర్ణ వ్యవస్థ జన్మతో ముడివడిన కులవ్యవస్థగా మారిపోయింది. తక్కువ కులం వాడు గుణవంతుడైనా సమాజంలో అతనికి సముచిత స్థానం లేకుండా పోయింది.

ఒక ప్రక్క స్వరాజ్యం కొరకై ఉద్యమం కొనసాగుతున్నది. కాని స్వారాజ్యం ప్రాధాన్యాన్ని జనులు గుర్తించలేదు. స్వరాజ్యం వచ్చినా ఆధ్యాత్మికతపై ఆధారపడిన స్వారాజ్యం సిద్ధించకపోతే మానవులు శాంతి సుఖాలు పొందలేరు.

ఔషధం రోగుల కొరకు ఏర్పడిందే కాని ఆరోగ్యవంతులకు కాదు. అజ్ఞాన వ్యాధిగ్రస్తులకు జ్ఞానబోధ ఎంతైనా అవసరం. వేదవిజ్ఞానం వారికి అందుబాటులోకి వచ్చినప్పుడే వారు ఆ రోగం నుండి విముక్తి పొందగలరు. అందువల్ల లౌకిక విద్యతోపాటు పారమార్థిక విద్య కూడా ప్రజానీకానికి అందుబాటులోకి రావాలి. మోక్షమోర్గంలో పయనించడానికి జనులకు ఎదురవుతున్న ఆటంకాలను ప్రయత్నంతో తొలగించాలి.

తీర్థయాత్రా కాలంలోనే ఇలాంటి ఉత్తమాశయాలు వేలప్పలో దృఢంగా నెలకొన్నాయి. అయితే ఏమి సాధించాలన్నా అందుకు కావలసిన సాధన

సంపత్తి ఎంతో అవసరం. ఈత రానివాడు ఇతరులకు ఈత నేర్పలేడు. తాను తరించనివాడు పరులను తరింపజేయలేడు. అందువల్ల లోకోద్ధారకమైన కార్యక్రమాలకు తాను పూనుకోవడానికి ముందు శోకశాంతి, ఆనందప్రాప్తి తనకు హస్తగతం కావాలి. అలాంటి అర్హత సాధించడానికే వేలప్ప తిరుమల గోగర్భగుహలో నిశ్చల తపోదీక్షకు పూనుకొన్నాడు.

దీక్షా ప్రారంభదశలో భగవత్ప్రార్థనామయమైన అతని హృదయం నుండి ఈ క్రింది శ్లోకం ఆవిర్భవించింది.

"అతీతవైరాగ్య మఖండబోధః
కదా ను మే సిధ్యతు హేదయాళో!
సమాధియోగస్య పరస్య నిష్ఠా
సర్వేషు భూతేషు సమత్వబుద్ధిః!!"

"ఓ దయగల పరమాత్మా! నాకు అతీతమైన వైరాగ్యమూ, అఖండమైన జ్ఞానమూ, ఉత్తమ మైన సమాధి యోగనిష్ఠ, సమస్త ప్రాణుల పట్లా సమత్వబుద్ధి ఎప్పుడు సిద్ధించునో" అని భగవంతుణ్ణి ఆర్ద్ర హృదయంతో వేడుకొన్నాడు.

ఏకాకియై కట్టుబట్టతో కాలినడకతో గోగర్భం చేరిన వేలప్ప అక్కడ ఘోర తపస్సులో నిమగ్నుడయ్యాడు. నిత్యమూ గుడికి వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని సందర్శించేవాడు. తిరుమల గ్రామానికి రోజుకు ఒక పూట మాత్రమే భిక్షకు వెళ్లేవాడు. తపోనిష్ఠ తీవ్రమయ్యే కొలదీ భిక్షకు పోవాలన్న బుద్ధి పుట్టేది కాదు. ఈ కాలంలో తన భోజన సమస్యను గూర్చి తరువాత ఆయన చెప్పిన మాటలివి.

"తీవ్ర తపస్సులో నిమగ్నుడనగు నేను భిక్షాన్నమునకై గృహస్థుల యిండ్ల వెంబడి తిరుగుచూ కాలము వృథా చేయుట మంచిది కాదని తలచితిని. అనేకులు బిచ్చగాండ్రు తిరుగాడు ఆ పుణ్యక్షేత్రములో అయాచితముగ భిక్ష దొరకుట కష్టమని నాకు తెలియకపోలేదు. ఏ పరమ సత్యమును గ్రహించుటకై గృహత్యాగము చేసితినో ఆ సత్యాన్వేషణకై ఆతురపడుచున్న నా మనస్సునకీ భోజన సమస్య తృణప్రాయముగా తోచినది. గోగర్భ తీర్థములో యాత్రికులు వదలిన పిండములోని పచ్చి పిండి తిని కొన్ని రోజు లుంటిని. శ్రీ వేంకటేశ్వరస్వామి నైవేద్యము వండిన ఖాళీ పాత్రలలోని మెతుకులు ఏరుకొని తినుచు అనేక దినములు తృప్తిపడితిని".

ఇలా ఏకాంతంలో మౌనియై కాలం గడుపుతూ తపోవృత్తితో గోగర్భగుహలో వున్న సాధువు మలయాళ దేశీయుడు కావడం వల్ల ఆయన ఊరూ, పేరూ తెలియని తిరుమల ప్రజలు 'మలయాళస్వామి' అని పిలువసాగారు. జన వ్యవహారంలో తుదకు ఆ పేరే స్థిరంగా నిలిచిపోయింది. తిరుమలకు వచ్చే యాత్రికులకు కూడా ఆయన 'మలయాళస్వామి'గా పరిచయ మయ్యారు.

భోజనాదులలో కాల నిర్ణయం పాటించకుండా స్వామి సమాధినిష్ఠ కొనసాగించేవారు. తిరుమల లోని చల్లని వాతావరణం వారి నిష్ఠ కెంతో దోహదపడింది.

స్వామికి పరిచితుడైన ఒక భక్తుడు క్రొత్త మట్టి కుండలో కొన్ని సున్ని ఉండలుంచి ''అవసరమైనప్పుడు స్వీకరించండి స్వామీ!'' అంటూ సమర్పించాడు. ఒక ఉండ తిని ధ్యానానికి కూర్చోగా మరొక ఉండ తినాలనే సంకల్పం వారికి కల్గింది. ఈ కుండ ఇక్కడ ఉంటే ధ్యానం కొనసాగదని

నిశ్చయించుకొని అందలి ఉండలను బిచ్చగాండ్రకు పంచిపెట్టి స్వామి పాత్రను పారవేశారు. మొదటి దశలో స్వామి దీక్ష ఇలా కొంతకాలం గడిచింది.

భగవత్కరుణానుభవం

అప్పట్లో స్వామి వద్దకు జనులు అంత ఎక్కువగా వచ్చేవారు కారు. తిరువెంకటాచార్యులు అనే ఒక శ్రీవైష్ణవులు స్వామి గుడికి వెళ్ళే సమయానికి ప్రసాదం ఇచ్చేవారు. ఒక వర్షాకాలంలో గోగర్భంలో నీరు నిండుగా ప్రవహించడం వల్ల మూడు దినాలు కాలువ దాటడానికి వీలుపడలేదు. ఆకలి బాధ స్వామిని అమితంగా పీడించింది. అప్పుడు శివానందలహరిలోని ఈ క్రింది శ్లోకం వారి స్మృతికి వచ్చింది.

"స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితాగాన ఫణితౌ
పురాణే మంత్రే వా స్తుతినటనహాస్యేష్వచతురః,
కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి? కో౽హం పశుపతే!
పశుం మాం సర్వజ్ఞ! ప్రథితకృపయా పాలయ విభో!"

"స్మృతి, శాస్త్రం, వైద్యం, శకునం, కవిత్వం, గానం, పురాణం, మంత్రం, స్తోత్రం, నాట్యం, హాస్యం... వీటిలో నేను నేర్పరిని కాను. నాపై ప్రభువులకు ప్రీతి ఎలా కల్గుతుంది? ఓ పశుపతీ! నేనెవడను? ఓ సర్వజ్ఞా! ప్రభూ! దయతో పశుతుల్యుడనైన నన్ను రక్షించు!"

ఈ పద్యం పఠించిన సమయం సరిగా పగలు మూడు గంటలు. అప్పుడు దేవాలయంలో షరాబుగా ఉన్న ఒక భక్తుడు మధ్యాహ్న భోజనం చేసి నిద్రిస్తూ వున్నాడు. శ్రీ వేంకటేశ్వరస్వామి అతనికి కలలో కనిపించి "పలానా చోట నా భక్తుడు ఆకలితో తపిస్తున్నాడు. వెంటనే అన్నం

తీసుకొనిపోయి పెట్టు" అని చెప్పాడు. ఆ దినం మైసూరు సత్రంలో ఒక ఉపనయనం జరిగింది. ఈ భక్తుడు అక్కడికి వెళ్లి అన్నం తెచ్చి ఆ అన్నపుమూటను ఒక వెదురు గడకు కట్టి కాలువ ఆవలి వైపునుండి స్వామికి అందజేశాడు. ఈ రీతిగా స్వామికి అతిక్లిష్ట సమయంలో భగవత్కరుణానుభవం కల్గింది.

తర్వాత మహంతుగారి తమ్ముడు రామలఖనదాసుగారు స్వామికి భగవత్ప్రేరణతో భోజనం ఏర్పాట్లు మఠంలోనే చేశారు. స్వామి కొంతకాలం నిత్యం మఠానికి వెళ్లి భుజించి వచ్చేవారు. ఒకనాడు స్వామి తీవ్ర ధ్యాననిష్ఠలో ఉండి సమయం గుర్తించలేదు. ప్రొద్దు బాగా వ్రాలిన తర్వాత భోజనానికి వెళ్ళారు. అందుకు మఠంలోని వంటవారు విసుగుచెంది అప్రియంగా ప్రవర్తించారు. ఇక అక్కడికి భోజనార్థం పోకూడదని స్వామి నిర్ణయించుకున్నారు. "భగవంతుడు ఇక్కడికి ఆహారం పంపితే స్వీకరిస్తాను. లేకపోతే ఉపవాసమే" అని దృఢదీక్ష పూని గోగర్భగుహలోనే కూర్చున్నారు.

ఆ మరుదినం తిరుపతిలోని భక్తుడొకడు స్వామికి భిక్ష యివ్వాలని సంకల్పించుకొన్నాడు. గోగర్భానికి వెళ్లి అక్కడ వంట చేసి స్వామి దర్శనానికై నిరీక్షిస్తూ వుండిపోయాడు. సాయం సమయానికి స్వామి సమాధినుండి లేచి గుహ వెలుపలికి వచ్చారు. భక్తుడు వారికి ప్రణామం చేసి భిక్ష స్వీకరించవలసిందిగా ప్రార్థించాడు. ఆ మాట వినగానే స్వామి కనులు చెమ్మగిల్లాయి. "అనన్యాశ్చింతయంతో మాం" అన్న భగవంతుని మాట స్మరించుకొని భిక్ష పరిగ్రహించి భక్తుణ్ణి అనుగ్రహించారు. అప్పటినుండి గోగర్భతీర్థానికి భక్తుల రాకపోకలు ఎక్కువయ్యాయి. సూర్యు దస్తమించినా ఒక్కొక్కసారి స్వామి గుహనుండి వెలుపలికి వచ్చేవారు కారు. అలాంటి దినాలలో స్వామి సందర్శనార్థం సాయం సమయం వరకూ వేచివుండిన

భక్తులు క్రూరమృగాలకు భయపడి తాము తెచ్చిన భోజన పదార్థాలను గుహవద్ద చెట్లకు వ్రేలాడగట్టి తిరిగి వెళ్లేవారు.

క్రమక్రమంగా స్వామి కీర్తి నలుదెసలా ప్రాకింది. వచ్చీరాని తెలుగులో అవ్యక్తమధురంగా స్వామి భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చేవారు. యాత్రికులకు శ్రీవేంకటేశ్వర దర్శనంతో పాటు మలయాళ సద్గురు సందర్శనం కూడా కర్తవ్య మయింది.

స్వామి నివాసానికై భక్తులు ఒక పూరి కుటీరం నిర్మించారు. ఆయన అహోరాత్రాలూ తపోనిష్ఠ కొనసాగిస్తూ, దివ్యమంత్రాలు జపిస్తూ, మహా వాక్య మనన నిదిధ్యాసాలు చేస్తూ కాలం గడిపారు.

తుంబురుతీర్థం, సనకసనందనతీర్థం, కుమారధారాతీర్థం. రామకృష్ణతీర్థం, శ్రీ వైకుంఠతీర్థం మొదలైన తీర్థాలలో గూడా కొంత కొంత కాలముండి స్వామి తపస్సు కొనసాగించారు. తరిగొండ వెంగమాంబ తుంబురు తీర్థంలోనే యోగసిద్ధి పొందిందట! తనకెంతో మనశ్శాంతి. స్వస్వరూపస్థితి ఆ తీర్థంలో కలిగిందని తరువాత స్వామి చెప్పివున్నారు.

ఒకనాడు తుంబురుతీర్థంలో స్వామి స్నానానికి వెళుతూ వుండగా ఒక పెద్దపులి ఎదురుగా వచ్చింది. అప్పుడు వారు "ఓ పరమాత్మా! ఈ పులి రూపంలో ప్రత్యక్షమయింది నీవే. ఈ శరీరంతో లోకానికి ఏమైనా ప్రయోజనముంటే వదలిపో! లోకపోతే తృప్తిగా భుజించి వెళ్లు" అని భగవంతుణ్ణి స్మరిస్తూ కదలకుండ నిలిచారు. పులి కొంతసేపు స్వామివైపు చూచి వెనుకకు మరలిపోయింది.

స్వామి దర్శనానికై వచ్చిన భక్తులు కొందరు తుంబురు తీర్థంలో ఉండగా ఒక చిరుతపులి దప్పికతో అక్కడికి వచ్చింది. భక్తులు భయంతో దానిని

పారదోల ప్రయత్నించారు. స్వామి వారిని వారించి "ఈ వనములు వారి స్వస్థానములు. మనం ఇక్కడ నివాసం కల్పించుకొని వారిని తరుముటయా? వద్దు!" అని చెప్పారు. ఇంతలో పులి దప్పిక తీర్చుకొని గాండ్రిస్తూ వెళ్లిపోయింది.

స్వామి సనకసనందన తీర్థంలో వున్నప్పుడు భక్తులు విరివిగా అచటికి వచ్చి భిక్షలు జరిపేవారు. "నాకు భక్తు లిలా భిక్షలిస్తున్నారు. నేనిందుకు తగిన వాడనా? అయితే ఎక్కడ ఉన్నా ఇలాగే జరగాలి కదా!" అనుకుంటూ ఎవరికీ చెప్పకుండా ఒకనాడు స్వామి తుంబురు కోనకు వెళ్లారు. సనకసనందన తీర్థంలో స్వామిని దర్శింపవచ్చిన క్రొత్త భక్తులు కొందరు దారి తప్పి సరాసరి తుంబురు కోనకే వచ్చారు. అక్కడ స్వామిని చూచి "అయ్యా! మేము మలయాళస్వామికి భిక్ష ఇవ్వడానికి వచ్చాము. వారున్న చోటికి ఎలా పోవాలో తెలపండి" అని వారినే అడిగారు. సంగతి గ్రహించి అక్కడే భిక్ష ఘనంగా జరిపారు. స్వామి జీవితంలో ఇట్టి దివ్యానుభవాలు ఎన్నో!

ఎందుకీ తపస్సు?

సనకసనందనతీర్థంలో స్వామి తపస్సు చేసేటప్పుడు ఒక జిజ్ఞాసువు స్వామిని "అయ్యా! ఈ నిర్జన ప్రదేశంలో మీరు ఎందుకు తపస్సు చేస్తున్నారు? భగవంతుని ప్రత్యక్షం చేసుకోవడానికా? మోక్షాపేక్షతోనా? లేక మరేదైనా ప్రయోజనం ఆశించా?" అని ప్రశ్నించాడు.

అందుకు స్వామి ఇలా బదులిచ్చారు. "మహాశయా! నేను ఈశ్వర సాక్షాత్కారం కొరకై తపస్సు చేయడం లేదు. ఎందుకంటే ఈశ్వరుడు పూర్వం అనేకులకు ప్రత్యక్షమై ఉపదేశించిన విషయాలు భగవద్గీతాది గ్రంథాలలో

ఉండనే ఉన్నాయి. ఇప్పుడు భగవానుడు ప్రత్యక్షమై అనుగ్రహించడానికి అంతకంటే క్రొత్త విషయం ఏమున్నది?

ఇక మోక్షం కొరకంటారా? అది ప్రాణి కోట్లకు స్వతస్సిద్ధమై వున్నది. బద్ధుడు కానివాడు ముక్తిని అపేక్షించవలసిన పని లేదు కదా?

ఇతర ప్రయోజనాలపై కూడా నాకు ఉద్దేశం లేదు. ఆత్మ లభించిన తర్వాత మరొక లాభంపై కోరిక ఎలా కల్గుతుంది?

ఒక్క భయంనుండి తప్పించుమని మాత్రం నేను ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఆ కరుణామూర్తి నాకు జన్మరహితమోక్షం ప్రసాదిస్తాడేమో అన్నదే నా భయం. దానినుండి తప్పించి పునర్జన్మను అనుగ్రహించుమని నా ప్రార్థన. సర్వేశ్వరుణ్ణి ఎడబాయకుండా దర్శించడానికీ, తైలధార వలె అవిచ్ఛిన్నమైన భక్తి కల్గి వుండడానికీ, సర్వేశ్వరుని సన్నిధిలో చేరడానికి ఎవరెవరికి ఏయే ప్రతి బంధాలున్నాయో అవి తొలగించడానికీ, జనుల అంతఃకరణంలోని అజ్ఞానాన్ని నిర్మూలించడానికీ. “అందరిలో వున్నది ఒకే ఆత్మ, భేదదృష్టి విడనాడడమే ముక్తి” అని బోధించడానికీ అనువైన జన్మనే నేను కోరుకొంటున్నాను. “భేదాలు నిమ్నోన్నతావస్థలు, గుణకర్మల ఫలాలే కాని యథార్థాలు కావు. అన్ని ప్రాణులూ సుఖమే కోరుకుంటున్నాయి. వాటి సుఖమార్గానికి అడ్డు పోకూడదు. అలా పోవడం మహాపాతకం” అని బోధించే జన్మమే నాకు కావాలి. ఇదే నా ఆశయం”.

సంస్కరణోద్యమం

స్వామి ఒకనాడు తిరుమలలో యాచనా వృత్తితో జీవించే బిచ్చగాండ్ర పిల్లలను చూచి జాలిపడ్డారు. సుఖ జీవనానికి నోచుకోని ఆ బాలురకు

కొంత చదువు చెప్పి సంస్కరించదలచుకొన్నారు. దేవాలయాధికారి రామలఖనదాసుకు తన అభిప్రాయం తెలిపారు. స్వామి అభిమతం మేరకు అధికారులు వేయికాళ్ళమండపంలో రాత్రి పాఠశాల ఏర్పాటు చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. చదువుకొనే వారికి రాత్రి భోజనం దేవాలయం నుండే ఏర్పాటు చేశారు. పలకలు, పుస్తకాలు, వస్త్రాలు, పిల్లలకు ఉచితంగా ఇవ్వాలనే నిర్ణయం జరిగింది. దానితోపాటు పిల్లలు పాటించవసిన నియమాలను కూడా విధించారు. కాని ఈ నియమాలు పాటింపలేక పిల్లలు బడికి రావడం మానివేశారు.

తరువాత గోగర్భ క్షేత్రంలోనే కొందరు పిల్లలను చేర్చుకొని స్వామి స్వయంగా వారికి చదువు చెప్పడం ప్రారంభించారు. కాని ఆ పిల్లలు కూడా క్రమశిక్షణ పాటించలేక యాత్రికులనుండి దానాలు పుచ్చుకోవడానికై స్వామికి చెప్పకనే వెళ్లిపోయారు. ఈ రీతిగా అప్పుడు స్వామి తలపెట్టిన సంస్కరణోద్యమం విఫల మయింది. వ్యాసాశ్రమ స్థాపనానంతరం అది సఫల మయింది.

కోటంబేడు మఠం

నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి తాలూకాకు చెందిన కోటంబేడులో ఆ దినాలలో ఒకసారి ఉద్ధృతంగా కలరా వ్యాపించింది. ఊరివారంతా భయపడ్డారు. అనేకులు ఊరు వదలి వెళ్ళిపోయారు. కొందరు తిరుమలకు వచ్చి తమ గ్రామానికి పట్టిన దురవస్థను తొలగించవలసిందిగా స్వామిని వేడుకొన్నారు. స్వామి అందుకు సమ్మతించి కోటంబేడు వెళ్లారు. ఊరిలో పాడుబడివున్న దేవాలయాన్ని శుభ్రం చేయించి ఒక వారం రోజులు అక్కడే బస చేశారు. వారు ఏమి చేశారో ఏమో కాని ప్రజలు వ్యాధి విముక్తులయ్యారు. స్వామి తిరిగి తిరుమల చేరుకున్నారు.

మరొకసారి ఆ గ్రామ ప్రాంతాలలోనే పశువులకు వ్యాధి సోకింది. గ్రామస్థుల అభ్యర్థన మేరకు స్వామి మరల అక్కడికి విచ్చేసి పశువ్యాధిని రూపుమాపారు. స్వామిపట్ల గ్రామస్థులు మిక్కిలి భక్తిశ్రద్ధలు చూపారు. స్వామి చేసిన సూచన మేరకు శిథిలమైన శ్రీ రామమందిరాన్ని పునర్నిర్మించారు. ఊరి చెరువు వద్ద స్వామి వచ్చినపుడు నివసించడానికి అనువుగా ఒక కట్టడం కూడా నిర్మించారు. ఆ కట్టడమే కోటంబేడు మఠంగా ప్రసిద్ధి వహించింది. ఈ విధంగా ఆంధ్రదేశంలో తొలిసారిగా స్వామి ప్రభావాన్ని గుర్తించి వారికొరకై మఠం నిర్మించిన ఘనత కోటంబేడు గ్రామస్థులకు దక్కింది.

శుష్కవేదాంతతమో భాస్కరం

స్వామికి క్రమంగా తెలుగుభాషలో చక్కని పరిచయం ఏర్పడింది. గోగర్భానికి భక్తుల రాకపోకలు పెరిగాయి. జిజ్ఞాస గల సాధకులు అడిగే ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పి స్వామి వారిని సంతృప్తిపరిచేవారు.

ఆ దినాలలో సదాచార విహీనులైన శుష్కవేదాంతులు కొందరు గురువేషధారులై ప్రజలను వంచిస్తూ వుండేవారు. మరొకవంక 'సనాతనులు' కొందరు స్త్రీలకూ, ద్విజేతరులకూ బ్రహ్మవిద్యలో అధికారం లేదని చాలాకాలం నుండి చెబుతూ వచ్చారు. అందువల్ల సామాన్య జనులకు ఆత్మ వికాసం లేకుండా పోయింది.

స్వామి ఈ దుఃస్థితి గమనించి లోకాన్ని ఉద్ధరించాలన్న సదాశయంతో 'శుష్క వేదాంతతమో భాస్కరం' అన్న ఒక గ్రంథం రచించారు. ఈ రచన 1919 డిసెంబరు మొదటివారంలో పూర్తి అయింది. గురుశిష్య సంవాదరూపంలో ఉన్న ఆ పుస్తకంలో హిందూ సమాజములో బహుకాలం నుండీ వ్యాపించి వుండిన మూఢ విశ్వాసాలనూ, దురాచారాలనూ నిశితంగా

ఖండించారు. సాధకుల ఆత్మోన్నతికి అవసరమైన అనేక విషయాలను సప్రమాణంగా, సయుక్తికంగా అందులో పూస గ్రుచ్చినట్లు వివరించారు. కాపీరైటు హక్కులు లేని ఆ గ్రంథాన్ని అనేకులు ముద్రించారు. అది చదివినవారు శ్రీవారి మహానుభావతను గుర్తించి వారికి జోహారు లర్పించారు. నాటికీ, నేటికీ సాధకులకు కనువిప్పు కలిగించే గ్రంథరాజంగా, ఆంధ్రవాఙ్మయంలో ఆధ్యాత్మిక విభాగానికి మకుటాయమానంగా ఆ పుస్తకం ప్రశస్తి గాంచింది. ఇంగ్లీషు, హిందీ మొదలైన భాషల్లో కూడా ఇటీవల దానికి అనువాదాలు వెలిశాయి. ఆధ్యాత్మిక రంగంలోనే కాక, సాంఘిక క్షేత్రంలో కూడా ఆ గ్రంథం విప్లవం రేకెత్తించింది. సాధకులకు నిత్య పఠనీయమయింది. ఆ గ్రంథం వల్ల స్వామి కీర్తి సర్వతోముఖంగా వ్యాపించింది. దానివల్లనే వారికి అసంఖ్యాకంగా శిష్యులు ఏర్పడ్డారు.

శ్రీ వేంకటేశాది పూజా పంచరత్నమాల, ధ్యానామృతము మొదలైన ఇతర గ్రంథాలను గూడా కొన్నింటిని స్వామి గోగర్భంలో ఉన్నప్పుడే రచించారు. జన్మతో ముడివడిన వర్ణవ్యవస్థను సమర్థించే సనాతనులను స్వామి ఇలా హెచ్చరించారు –

"సర్వజనులకు వారి గుణానుసారముగ అన్ని విద్యలలో ప్రవేశము లేకపోవుటచేతనే కల్పవృక్షముల చేతను, కామధేనువులచేతను, చింతామణుల చేతను ప్రకాశవంతమై హిమాచలమునుండి సేతుపర్యంతము విస్తరించియుండు ఈ మహాభూఖండము పరుల కధీనమై ఈ దేశవాసులు బానిసలై పోవుటకు కారణమైనది.

విప్లవాత్మకమైన, సర్వసమభావంతో కూడిన శ్రీవారి సదాశయాలు ప్రజలలో ఎంతో చైతన్యం కలిగించి వారిని ఆత్మోన్నతివైపు పురోగమింప జేశాయి.

నిర్వేదం - దివ్యప్రబోధం

స్వామి గోగర్భం చేరి తొమ్మిది సంవత్సరాలు గడిచాయి. వారు ఏ పరమానందప్రాప్తిని ఆశించి అక్కడ తపస్సుకు పూనుకున్నారో, ఆ స్థితి తనకింకా కలుగలేదని పరమ నిర్వేదానికి లోనయ్యారు. ఒక దశలో ఆత్మహత్యకు కూడా సిద్ధపడ్డారు. ఇక మూడు దినాలలో లక్ష్యసిద్ధి కల్గకుంటే ప్రాణం త్యజించాలన్న నిశ్చయానికి వచ్చారు. నిద్రాహారాలు వదలి నిశ్చలధ్యాన స్థితులయ్యారు.

అప్పుడు "పూర్ణ దైవభావంతో పండ్రెండు సంవత్సరాలు బ్రహ్మనిష్ఠ పూర్తి చేయకపోతే ఆత్మసాక్షాత్కారం సిద్ధించదు" అన్న దివ్య వచనాలు వారికి వినిపించాయి.

తరువాత తన నిష్ఠాకాలం ఇంకా పూర్తి కాలేదని భావించి స్వామి తదేకనిష్ఠతో మూడు సంవత్సరాలు గడిపారు. తుదకు వారికి దివ్యప్రబోధం కలిగింది. పరమానంద పరిపూర్ణమైన ఆ సాక్షాత్కారస్థితిని వర్ణించడానికి మాటలు చాలవు. ద్వాదశ సంవత్సరాలు బ్రహ్మనిష్ఠ అవలంబించిన వారికి తప్పక దైవ సాక్షాత్కారం లభిస్తుందని శ్రీవారు తరచు చెప్పేవారు. ప్రబల తపోదీక్షలో వున్న ఆకాలంలో "ఓ పర్వతమా! ఆవలికి పొమ్ము!" అని శాసిస్తే అది పోగలదన్నంత దృఢమైన ఆత్మవిశ్వాసం తనకు ఉండేదని వారు వక్కాణించి వున్నారు.

కొండ దిగుట

శ్రీవారు తిరుమల చేరి పండ్రెండు సంవత్సరాలు గడచాయి. వారి సర్వ సమభావ సంపన్నమైన ధర్మ ప్రబోధం సమాజంలో మార్పును వ్యతిరేకించే సనాతనులలో విద్వేషాగ్ని రగుల్కొల్పింది. ఇందువల్ల స్వామికి

తిరుమలలో తీవ్రమైన వ్యతిరేక వర్గం ఒకటి ఏర్పడింది. ఆ వర్గం వారు నాటి దేవస్థానాధిపతి మహంతుకు స్వామిపై భిన్నాభిప్రాయం కలిగేటట్లు నానావిధ నిందలుమోపి ప్రచారం చేశారు. వారి ప్రయత్నాలు తీవ్రస్థాయి నందుకొన్నాయి.

ఎప్పటి కప్పుడు స్వామి ఈ పరిస్థితులు గమనిస్తూ వచ్చారు. పెద్ద యెత్తున తాను తలపెట్టిన లోకోద్ధారక కార్యక్రమాలకు ఆ కాలంలో తిరుమల అనువైనది కాదని కూడా వారు భావించారు. దైవేచ్ఛ ఎలా వుంటే అలా జరుగుతుందనే నిర్ణయానికి వచ్చారు.

తిరుమల దిగిన పిదప స్వామికి నివాసయోగ్యమైన స్థానానికై కొందరు ముఖ్యభక్తులు అన్వేషణ సాగించారు. తిరుపతి - శ్రీకాళహస్తి క్షేత్రాల మధ్య వున్న ఏర్పేడు సమీపంలోని కాశీబుగ్గ ప్రదేశం అన్ని విధాలా అనుకూలమయిందన్న నిశ్చయానికి వచ్చారు.

ఇంతలో మహంతు నుండి "గోగర్భం యాత్రా స్థలం. అక్కడికి యాత్రికులు వస్తూ పోతూ వుంటారు. సాధువులు అక్కడ స్థిరంగా వుండరాదు. మీకిష్టమైతే పుష్కరిణికి ఉత్తరాన వున్న తోటలో వుండవచ్చు" అన్న తాకీదు స్వామికి చేరింది.

3-6-1926వ తేదీన శిష్యులు కొందరు వెంట రాగా "శ్రీ వేంకటేశ్వరుడు ఇంతకాలం మమ్ము ఇక్కడ నిలిపాడు. ఇప్పుడిక్కడ నుండి పొమ్మన్నాడు. దైవాజ్ఞ తలదాల్చి మేము తరలిపోతున్నాం" అని చెప్పి స్వామి కొండ దిగారు. తిరుపతి భక్తులు కపిలతీర్థంలో వారికి స్వాగతం పలికారు. నాటి సాయంసమయానికి స్వామి ఏర్పేడు - కాశీబుగ్గ చేరుకొన్నారు.

చతుర్థ ప్రకరణం

స్వామి కాశీబుగ్గ చెంత అడుగుపెట్టిన దినమే వ్యాసాశ్రమం ఆవిర్భవించిన శుభదినం. వేదాలను విభజించి, భారతాది గ్రంథాలను రచించి శ్రీమన్నారాయణుని అపరావతారంగా ప్రసిద్ధి గాంచిన వేదవ్యాసుని పేరుతో ఆశ్రమం నెలకొల్పడంలోని ఔచిత్యాన్ని పాఠకులు సులభంగా గ్రహించగలరు.

స్వామి నివాసానికి అనుగుణంగా భక్తులు కాశీబుగ్గకు ఉత్తరాన ఒక కుటీరం నిర్మించారు. నేటి పూజా మందిరం ఆ కుటీరమే. స్వామి ధ్యాననిష్ఠకు అనుకూలంగా నిష్ఠాశ్రమం అన్న పేరుతో మరొక కుటీరం కూడా నిర్మితమయింది. అదే నేటి గురుదేవుని అధిష్ఠాన మందిరంగా రూపొందింది. నాడు దుర్గమమైన అరణ్యంగా వుండిన ప్రదేశమంతా నేడు సుందరమైన ఆశ్రమసీమగా మారిపోయింది. కాలం కలిగించే మార్పులు ఊహాతీతాలు కదా!

ఆశ్రమభూమి స్వామిపేర లేకపోతే భవిష్యత్తులో చిక్కులు ఏర్పడవచ్చు. అందువల్ల స్వామి అభిమతం మేరకు నాటి శ్రీకాళహస్తి పరిపాలకులు శ్రీకుమార వెంకటలింగమనాయనింగారు ఆ ప్రదేశాన్ని స్వామి పేరున రిజిష్టరు చేయించి యిచ్చారు.

స్వామి యేర్పేడు వద్ద ఆశ్రమస్థాపన చేశారన్న వార్త క్రమంగా భక్తులందరికీ తెలిసింది. స్వామి సందర్శనానికై వారు ఆశ్రమానికి రావడం మొదలయింది. భక్తిశ్రద్ధలతో భక్తులు సమర్పించే కానుకలు ఆశ్రమ నిర్వహణకు ఉపకరించాయి. చేరువలోనే ఉన్న కొన్ని అగ్రహార గ్రామాలను

అనుభవించుకొనే దక్షత లేనిబ్రాహ్మణులు అమ్మజూపారు. భక్తుల సాయంతో ఆశ్రమమే ఆ గ్రామాలను కొనుగోలు చేసింది.

జంతుబలి నివారణ

కాశీబుగ్గకు తూర్పుగావున్న కోనేటిగట్టున జువ్విచెట్టు క్రింద చాలాకాలంనుండి పరిసర గ్రామాల జనులు శక్తి పూజలు చేస్తూ వచ్చారు. అక్కడ జంతుబలి గూడా జరిగేది. ఆశ్రమ స్థాపనానంతరం ఆ ప్రాంతంలో జంతుబలి చేయరాదని స్వామి గ్రామస్థులకు చెప్పి పంపారు. ఐనా కొందరు స్వామి మాటలు లెక్క చేయక బలి ఇవ్వడానికి పూనుకొన్నారు.

అప్పుడు స్వామి శిష్యులు వారి వద్దకు పోయి "అయ్యా! ఇక్కడ జంతుబలులు ఇవ్వరాదని మా స్వాముల వారి సందేశం. ఇది మీకు సమ్మతం కాకపోతే ముందు మమ్మల్ని నరకండి. ఆ తరువాతనే జంతువులను బలి ఇవ్వండి!" అంటూ బలిపీఠం వద్ద తలలు వంచి నిలిచారు. నాటితో అక్కడి హింసా ప్రవృత్తి అరికట్టబడింది. మాంసభక్షణం కూడా తగదని స్వామి అనేక యుక్తులతో భక్తులకు బోధించేవారు. వారి అహింసా ప్రబోధం వల్ల వేలకొలది జనులు శాకాహారులుగా మారారు. ఏమి చేసినా ఆత్మకు అంటదని చెబుతూ ఆహార విహారాలలో నియమం పాటించక అమాయక ప్రజలను వంచించే శుష్కవేదాంతులకు స్వామి సింహస్వప్నం అయ్యారు.

గ్రహరోగ నివారణ

గ్రహావిష్టులూ, రోగపీడితులూ స్వామి గోగర్భంలో వున్నప్పుడే వారిని ప్రార్థించి బాధా విముక్తులవుతూ వచ్చారు. స్వామి వారికిచ్చే తీర్థం, విభూతి రోగ నివారణ చేసేవి. వ్యాసాశ్రమానికి కూడా రోగులు రావడం మొదలయింది. తన సంకల్పశక్తిని ఆ విధంగా రోగ నివారణకు

వినియోగించడం తగదని స్వామి గుర్తించారు. ఎన్ని చికిత్సలు చేసినా ఆ శరీరాన్ని ఎన్నాళ్లు నిల్పగలం? మనుజులకు సంసార తరణోపాయం చూపడమే ముఖ్యం. అందువల్ల స్వామి ఒకనాడు "ఇక నేను తీర్థం, విభూతి యిచ్చినా జనులకు దాని వల్ల బాధానివృత్తి కలుగకుండుగాక!" అని దృఢంగా సంకల్పించారు. నాటి నుండి ఆశ్రమంలో వ్యాధిగ్రస్తుల బెడద తొలగింది. ముముక్షువులు, జిజ్ఞాసువులు అధికంగా ఆశ్రమానికి రావడం జరిగింది.

యథార్థభారతి

ఆనాడు ఆంధ్రదేశంలో అనేత పత్రికలు ప్రచారంలో ఉండినాయి కాని వాటిలో ఆధ్యాత్మిక విషయాలకు సముచితస్థానం లేదు. ఒక సదాశయం ప్రచారం కావాలంటే ఆధునిక యుగంలో పత్రికల తోడ్పాటు చాలా అవసరం.

అందువల్ల స్వాములవారు పత్రికాధిపతులకు కొందరికి పత్రికలలో ఆధ్యాత్మిక విషయాలకు స్థానం కల్పించే విషయమై లేఖలు వ్రాశారు. కాని వారి నుండి సమాధానం రాలేదు. అందుకని శ్రీవారు ఆశ్రమం తరపుననే ఒక మాసపత్రిక ప్రారంభించాలన్న నిర్ణయానికి వచ్చారు. తదుపరి భక్తులకు ఈ క్రింది విధంగా ఒక విజ్ఞప్తి చేశారు ...

''అధ్యాత్మజ్ఞానాసక్తులగు ప్రియుమైన సోదరీ సోదరులారా! కరుణానిధియగు సర్వేశ్వరుని కారుణ్యామృతవృష్టిచే పాపబుద్ధి యను దోషాగ్ని శమించి జీవులెల్లరు నిర్మలహృదయు లగుదురు గాక! ఆంధ్రదేశములో అనేక మాసపత్రికలు, పక్షపత్రికలు, వారపత్రికలు, దినపత్రికలు ప్రచారములో నున్నను ఆధ్యాత్మిక విషయములను కొన్ని పత్రికలు మాత్రమే అప్పుడప్పుడు స్వల్పముగా ప్రకటించుచున్నవి. ఈ కొరత పూర్తి చేయుటకు జిజ్ఞాసువులగు

ఆంధ్రసోదరుల తోడ్పాటుతో 'యథార్థభారతి' అను పేర ఒక మాసపత్రిక నడపదలచితిని.

ఇలా విజ్ఞాపనం చేస్తూ స్వామి 1927 ఫిబ్రవరిలో యథార్థభారతిని ప్రారంభించారు. పత్రికాభివృద్ధికి అనేకులు తోడ్పడ్డారు. చాలామంది పత్రికకు పోషకులుగా చేరారు. పత్రిక క్రమంగా వ్యాప్తి చెంది కర్మ – భక్తి – ధ్యాన – జ్ఞాన యోగాలను ప్రచారం చేసింది. 'యథార్థభారతి' అన్న పేరుకు తగినట్లు సత్య స్వరూపుడైన పరమాత్మ వైపునకు జనులను మళ్ళించింది. స్వామి సదాశయాలు పత్రిక ద్వారా నలుమూలలా విస్తరించాయి. మొదట ఈ పత్రికలో వెలువడిన స్వామి రచనలు తరువాత అనేక గ్రంథాలుగా రూపొంది అనన్యసామాన్యమైన ఆధ్యాత్మిక క్రాంతి కల్గించాయి.

సనాతన వేదాంతజ్ఞాన సభ

వ్యాసాశ్రమ స్థాపన జరిగిన రోజుల్లో ఆంధ్రదేశంలో సాధుసంఘాలు చెప్పుకోదగినంతగా లేవు. ఆ కొరత తీర్చాలని స్వామి నిశ్చయించుకొన్నారు.

1926 లోనే ఒక దినం స్వామి సంకల్పం మేరకు చాలామంది భక్తులు ఆశ్రమంలో సమావేశమయ్యారు. 'సనాతనధర్మ పరిపాలన సేవా సమాజం' అన్నపేరుతో వారు ఒక సంఘం స్థాపించుకొన్నారు. ఆ తరువాత పది దినాలకు శ్రీకాళహస్తి తాలూకాకు చెందిన పాలచ్చూరులో పై సమాజ ప్రథమ సమావేశం ఏర్పాటయింది. అప్పుడు స్వామి భక్తుల నుద్దేశించి యిలా అన్నారు ...

"పరిశుద్ధ జ్ఞానస్వరూపులైన సోదరీ సోదరులారా! వందనములు. ఈ సమాజము ప్రారంభమై నేటికి పది దినములు గడచినవి. నేడీ దివ్య సభలో మహానుభావులగు అనేక పుణ్య పురుషులు, చరిత్ర శుద్ధిగల అనేక

నారీమణులును సాన్నిధ్యము నొందియున్నారు. ఆంధ్రదేశములో ఎన్నో సభలుండినను బ్రహ్మ నిష్ఠులగు సాధువుల సమాజము దుర్లభముగా ఉన్నది. ఈ దేశమింత విశాలమైనదై, ధర్మ గుణములతో గూడినదై దయార్ద్ర హృదయులగు జనులచే నిండినదై యుండియు లోకసేవాపరమగు సాధుసంఘ మొకటి లేకపోవుట కొరతగదా! దివ్యజ్ఞాన సంఘము మున్నగునవి లోకోద్ధరణ కొరకు పని చేయుచున్న విషయము మనకు తెలిసినదే. కనుక శక్తి వంచన లేని లోకసేవ, ఆత్మ విముక్తి నొందుట, బద్ధజీవుల విముక్తికై మనసా, కర్మణా, వాచా ప్రవర్తించుట మన కర్తవ్యము. మహాత్ములందరు ఈశ్వరసేవకన్న లోకసేవయే మహత్తరమని వారి జీవితములో అనుష్ఠించి చూపియున్నారు.

ఈ విషయమై ఏయే కార్యములు మన మనుష్ఠింపవలసియున్నవో, వానిని ధర్మకోవిదులగు మీరందరు చర్చించి తీర్మానింప గోరెదను".

స్వామి కోరిక మేరకు సభ్యులు బ్రహ్మవిద్యా ప్రచారానికీ, లోకసేవకూ అనుగుణమైన కొన్ని తీర్మానాలు చేశారు వ్యాసాశ్రమంలో నిర్మాణాత్మకమైన పనులు నిర్వహించాలని నిశ్చయించుకొన్నారు.

గోగర్భంలో స్వామి తపోనిష్ఠలో ఉన్నప్పుడు పలువురు భక్తులు వారిని సందర్శించేవారు కదా! వారిలో కొందరు వ్యాసాశ్రమ స్థాపనానంతరం స్వామి లోకసేవా కార్యక్రమాలలో నిమగ్నులు కావడం చూచి ఆయనపై తమ విశ్వాసం సడలించుకొన్నారు. వారిలా అనుకొన్నారు – "గోగర్భంలో స్వామి సదా తపోవృత్తిలో ఉండేవారు. ఇప్పుడు వారు పాఠశాల, పత్రికా నిర్వహణ, సభలు మొదలైన లౌకిక వ్యాసంగంలో ప్రవేశించారు. ఇది సాధువృత్తి నుండి దిగజారడమే కదా!"

లోకసేవా ప్రాముఖ్యం

కర్ణాకర్ణికగా స్వామికి ఈ సంగతి తెలియవచ్చింది. 1928 ఏప్రిల్లో అరవపాళెం గ్రామంలో జరిగిన వేదాంత సభలో పలు ప్రాంతాలనుండి వచ్చిన భక్తులను ఉద్దేశించి స్వామి ఈ రీతిగా చెప్పారు.

"నేను ప్రపంచ ప్రాణులపై ప్రేమను పరిత్యజించి అత్యధిక విరక్తి నవలంబించి ఏకాంతమందుండు కాలములో నాపై మిక్కిలి ప్రీతి నెరపిన భక్తుల కిప్పుడు లోకసేవలో కొంచెము ప్రవేశించిన నాయందు సంపూర్ణ విశ్వాసము లేకపోయినది. నేను మాత్రము నాయొక్క ప్రస్తుతస్థితి నాటికంటే వేయిరె ట్లెక్కువ శ్రేష్ఠమైన దనియు, విధియుక్తమైన దనియు, ఋషిధర్మ మనియు తలంచుచున్నాను. ఏకాంతమున ఏకాకినై నేను కాలము గడపినది ఆ స్థితి సర్వోత్కృష్టమైనదని తలచి కాదు. లోకసేవ చేయుటకు దగిన పరిపక్వత గలుగజేసి కొనుటకే అట్లొనర్చితినని మీరు మరువకుందురు గాక!"

ఈ రీతిగా సనాతన వేదాంతానికి ప్రాధాన్యమిచ్చినా ఏ విధమైన మతద్వేషాలకూ అవకాశం కల్గించకుండా స్వామి ఈ సభలను ప్రతి సంవత్సరం మత సమన్వయ దృక్పథంతో నిర్వహించారు. 1929లో కృష్ణా జిల్లాలోని పామర్రులో మూడవ సభ జరిగింది.

శ్రీవారు ఆ సభలో ఇలా ప్రబోధించారు. 'ఇతరుల ఆత్మోన్నతికి అడ్డుపోకుండుట, సాధ్యమైనచో వారికి సాయము చేయుట, తన ఆత్మోన్నతికి అడ్డు కలిగిన తొలగించుకొనుట సనాతన ధర్మమగును. తాను తరించి ఇతరులను తరింపజేయుటకు ప్రయత్నించుటే సనాతన ధర్మము.

ఒక చెవితో ఉపనిషచ్ఛ్రుతిపాద్య బ్రహ్మమును వినుడు. రెండవ కర్ణముతో దీనుల దుఃఖాలాపములను ఆకర్ణించి తన్నివృత్తికై యత్నింపుడు. ఒక దృష్టితో బ్రహ్మము ననవరతము దర్శింపుడు. రెండవ నేత్రముతో దీనజనుల ఆర్తి నవలోకింపుడు. ఒక చేతితో ఇహపరధనముల నార్జింపుడు. రెండవ హస్తమున దానిని లోకమున కిచ్చుటకు త్వరపడుడు. ఒక పాదముతో జ్ఞాన విజ్ఞానములను సంపాదించుటకై చరింపుడు. రెండవ చరణముతో వానిని భక్తుల కొసంగుటకై పరుగిడుడు. ఇట్లాచరించుటయే యథార్థమైన తపస్సనియు. ఋషిమత మనియు, సనాతన ధర్మ మనియు మరువకుడు".

రాజమండ్రి సభ

నెల్లూరు జిల్లా నెల్లటూరులో నాల్గవ సభ జరిగింది. పిమ్మట ఐదవ సభ రాజమండ్రిలో 1931 వ సంవత్సరంలో ఏర్పాటయింది. ఈ సభకు వీరభద్రపురం నుండి సాధుమాత, వారి శిష్యురాండ్రు, అనేక భక్త సంఘాలు, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, మహారాజ న్యాపతి సుబ్బారావు పంతులుగారు మొదలైన ప్రముఖులు విచ్చేశారు.

శ్రీపాద వారికి మొదట స్వామిపై పెద్ద గౌరవం ఉండేది కాదు. సభా కార్యక్రమాలు తిలకించి, గురుదేవు లిచ్చిన మహోపన్యాసం ఆలకించిన పిదప వారికి స్వామిపై ఎనలేని భక్తిభావం కల్గింది. ఆయన శ్రీస్వాములవారిని స్తుతిస్తూ పంచరత్నాలు రచించి సభలో స్వామికి సమర్పించి ప్రణమిల్లారు. ఆ స్తుతిలో స్వామిని అపరవ్యాసుడుగా, ఆధునిక శంకరుడుగా ఆర్ద్ర హృదయంతో అభివర్ణించారు.

1937లో పోడూరులో జరిగిన సభకు శ్రీపాద కృష్ణమూర్తిగారే అధ్యక్షత వహించారు. ఆ సభలో వారిలా అన్నారు ...

"లోకమును తరింపజేయుటకు పరమేశ్వరు డనేకరూపముల నవతరించుచుండును. అజ్ఞులు గుర్తింపలేక ఆర్తిపాలగుదురు. సుజ్ఞానులు చక్కగా గుర్తించి సేవించి తరింతురు. శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి యందు మున్ముందుగా నాకు గౌరవము పుట్టలేదు. కొలది సంవత్సరముల క్రిందట రాజమహేంద్రవరమున శ్రీవారి బోధను ఈషణ్మాత్రము వినుట చేత నా హృదయమున భక్తి ఉప్పతిల్లినది. నాయందిట్టి పరివర్తన మసాధారణమని చెప్పవలసి యున్నది. అప్పుడు శ్రీ స్వాముల వారిని గూర్చి కొన్ని శ్లోకములు వ్రాసి చదివితిని. తదాది నా భక్తి సాంద్రమగుచున్నది. శ్రీమలయాళస్వాములవారు ఆదిశంకరులవలెనే మలయాళ దేశమున జన్మించి అద్వైతమత ధర్మమును సర్వజన సమ్మతముగా ప్రచారము గావించుచున్నారు. ఈ కాలమున జరుగవలసిన పనియే అది".

పది సంవత్సరాల వరకూ 'సనాతన ధర్మ పరిపాలన సేవా సమాజం' పేరుతో జరిగిన ఈ సభలు తరువాత 'సనాతన వేదాంత జ్ఞానసభలు'గా రూపొందాయి.

ఈ సభలలో ఒక పూట సభను మహిళామణులే పూర్తిగా నిర్వహించి ఉపన్యసించవలసిందిగా గూడా శ్రీవారు ఏర్పాటు చేశారు. వారి స్త్రీ జనోద్ధరణ దీక్ష అలాంటిది? ఈ సంప్రదాయం పై సభలలో నేటికీ అవిచ్ఛిన్నంగా సాగిపోతున్నది.

సంస్కృతపాఠశాల

స్వామి సంకల్పించిన లోకసేవా కార్యాలలో సంస్కృత విద్యావ్యాప్తి చాలా ప్రధానమైనది. ఆశ్రమంలో సంస్కృత పాఠశాలలోనూ, కన్యా గురుకులంలోనూ ఇప్పుడు వందలకొలది బాలబాలికలు సంస్కృత విద్య

అభ్యసిస్తున్నారు. 1928లోనే శ్రీవారు ఆశ్రమంలో సంస్కృత విద్యాలయం నెలకొల్పారు. భక్తులు అందుకు సహకరించారు.

సంస్కృత విద్యా ప్రాముఖ్యాన్ని వివరిస్తూ స్వామి యథార్థభారతిలో (జూలై – 1929) ఇలా వ్రాశారు – "పరిశుద్ధమైన జ్ఞానము, కరుణయు, శాంతియు, భక్తియు మూర్తీభవించిన ఓ ప్రియమైన సోదరీ సోదరులారా! 'విద్యావిహీనః పశుభిః సమానః' అని గదా పుణ్యభూమి యగు భారతదేశమున జన్మించిన ఋషిపుంగవుల దివ్యప్రబోధము! తత్త్వజ్ఞు లెల్లరు మన మార్యులమనియు, మన ముఖ్యభాష సంస్కృతమనియు తెల్పుచున్నారు. భారత ఖండమునందలి సమస్త భాషలయందును సంస్కృత శబ్దములు వ్యాపించియున్నవి. సంస్కృతము చదువనివారు గూడా ఆ శబ్దముల నధికముగా ఉచ్చరించుచున్నారు. మత విషయక గ్రంథములన్నియు సంస్కృత భాషలోనే కలవు. భాష లోపించినచో మతము గూడా కృశించును. దానితో ఆధ్యాత్మిక జ్ఞానశక్తియు క్షయమొందును. అంతటితో మనుజులు ద్విపాద పశువులై పోవుదురు. కావున ఎల్లవారును మాతృదేవతయగు సంస్కృత భాషనుద్ధరించిననే స్వరాజ్య స్వారాజ్యము లనబడు ఉభయలోకముల నుద్ధరింప గలుగుదురు.

ఇంతవరకు బ్రాహ్మణేతరులలో కొందరు బ్రాహ్మణులు మాకు సంస్కృత విద్య చెప్పలేదనియు, మా పురోగమనమున కట్టి భాష అత్యవసరమనియు చెప్పుచుండిరి. అట్టి వా రిప్పుడేల చదువ కూడదు? క్రియాశూన్యమైన వచనములు ఫలములేని పుష్పముల రీతి వ్యర్థములు గదా! ఇప్పు డా బ్రాహ్మణులే "సోదరులారా! సోదరీమణులారా! రండు, సంస్కృతము చదువుకొండు" అని కరుణతో పిలుచుచున్నారే! ఇట్టి తరుణములో ఏల

బ్రాహ్మణేతరులు సుషుప్తినుండి లేవకున్నారు? ఇది బ్రాహ్మణుల తప్పా? లేక బ్రాహ్మణేతరుల మాంద్యమా? అని విచారణ చేయుడు. శ్రీవ్యాసభగవానుని దివ్యనామధేయముతో స్థాపింపబడిన వ్యాసాశ్రమము మిమ్మందరిని పిలుచుచున్నది. ఇచట సంస్కృత పాఠశాల ఏర్పాటు చేయబడియున్నది. అందరును చదువుకొనవచ్చును. ఇంత వరకు మిమ్ము "దూరముగా పొండు. మీరు అనర్హులు" అని చెప్పుచుండిన లోకమున ఇప్పుడు "రండు రండు, మీరర్హులు" అను వాణి వీనుల విందుగా వినవచ్చు చున్నది. ఈ పావనకాలమును వ్యర్థపరచకుడు".

సన్యాస స్వీకారం

1936 వ సంవత్సరం స్వామి జీవితంలో చాలా విశిష్టమైనది. శ్రీవారు ఆత్మ సన్యాస సామ్రాజ్యానికి ఏనాడో అధిపతి అయ్యారు. 1936 వరకూ వారు తెల్లని ఖాదీ ధరించేవారు. ఆ సంవత్సరం ఫిబ్రవరిలో తురీయాశ్రమ స్వీకారం చేశారు.

స్వామి దృష్టిలో దేహ సన్యాసంకంటే ఆత్మ సన్యాసమే శ్రేష్ఠమైనది. ఉదర నిమిత్తం వేషం వేసేవారెందరో ఉంటారు. తపస్సు, విద్య లేకపోతే దేహ సన్యాసం పరిహాసపాత్ర మవుతుంది. అందుచేత వారు దేహసన్యాసానికి ప్రాముఖ్యం ఇవ్వలేదు.

కాని స్వామి శిష్యులు కాశి మొదలైన ప్రాంతాలకు వెళ్లి అక్కడి విద్యాలయాలలో ఉన్నత విద్య అభ్యసించాలంటే కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయి. సన్యాసదీక్షను స్వీకరించని గురువుల శిష్యులకు ఆ విద్యాలయాలలో ప్రవేశం ఉండేది కాదు. అందువల్ల ఈ శిష్యులు మరొక గురువు నాశ్రయించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఈ కారణంతో స్వామి శిష్యులు స్వామిని సన్న్యాసం స్వీకరించ వలసినదని గట్టిగా అభ్యర్థించారు. ఆశ్రమ విద్యార్థులు ఆత్మోన్నతి పొందడానికి ఎట్టి ఆటంకమూ ఉండకూడదన్న ఉద్దేశంతో స్వామి 1936 ఫిబ్రవరిలో తురీయాశ్రమ స్వీకారానికి నిశ్చయించుకున్నారు.

కాశిలోని వరవూత్మానందమండలేశ్వరోపాధ్యక్షులు శ్రీ శంకరానందయతివర్యులు దీక్షా ప్రదాతగా విచ్చేశారు. 2-2-1936వ తేదీన విధి ననుసరించి స్వామి సన్న్యాసం పరిగ్రహించారు.

గిరి సంప్రదాయానుసారంగా స్వామికి 'శ్రీ అసంగానందగిరి స్వామి' అని నామకరణం చేయబడింది. కాని ఆ పేరు వ్యవహారంలో ప్రశస్తి పొందలేదు. 'మలయాళస్వామి' అన్న పేరే నాటికీ, నేటికీ విఖ్యాతమై వున్నది. శ్రీ వారు గూడ తమ పేరును వ్రాయవలసిన వచ్చినచోట 'మలయాళస్వామి' అనే వ్రాసేవారు.

పంచమ ప్రకరణం

బ్రహ్మవిద్యా ప్రచారం

ప్రతి సంవత్సరం ఫాల్గుణ పూర్ణిమనాడు ప్రారంభమై మూడురోజుల పాటు జరిగే సనాతన సభలు పూర్తి అయిన తరువాత భక్తుల కోరిక ననుసరించి స్వామి ఇంచుమించు రెండు నెలల కాలం వివిధ ప్రదేశాలలో పర్యటించేవారు. ఈ పర్యటన కాలంలో ఏకాహాలు, సప్తాహాలు, ఓంకార సత్రయాగాలు మొదలైన అనేకాధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేవి.

వ్యాసాశ్రమానికి అనుబంధంగా ఎన్నో ఆశ్రమాలు స్థాపించ బడ్డాయి. బ్రహ్మ విద్యా ప్రచారం ముమ్మరంగా జరిగింది. శుష్కవేదాంతం, వాచా వేదాంతం పనికి రాదనీ, అనుష్ఠాన పూర్వకమైన వేదాంతమే ఆదరణీయమనీ స్వామి ఉద్ఘోషించారు.

గాంధి మహాత్మునితో కలయిక

ఇలాంటి సమున్నతాశయములతో స్వామి అనేక సంస్థలు స్థాపించారు. తమ సంచార కార్యక్రమంలో ఒకసారి శ్రీవారు బందరు వెళ్లారు. స్వాతంత్ర్యోద్యమనేత గాంధీమహాత్ముడు ఆ సందర్భంలో అక్కడే ఉండటం తటస్థించింది. డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య గారి ఇంటిలో స్వామి, మహాత్ముడు కలుసుకొన్నారు. ఆ సందర్భంలో స్వరాజ్య సాధనకొరకై పాటుపడటం ముఖ్యకర్తవ్యమని గాంధీగా రన్నారు. స్వరాజ్యంతో తృప్తిపడితే చాలదనీ, స్వారాజ్యం కొరకు గూడా అందరూ పాటుపడాలనీ, లేకపోతే శాశ్వత సుఖశాంతులు లభించవనీ స్వామి వచించారు. స్వామి చేపట్టిన లోకోద్ధారక కార్యక్రమాలను గురించి తెలుసుకొని గాంధీగారు సంతోషించారు. స్వామి గాంధీగారిని ఒక అవతార పురుషుడుగా భావించారు.

శిష్యులుగా మారిన వ్యతిరేకులు

1936లో కృష్ణాజిల్లాలోని ఉంగుటూరులో సనాతన వేదాంత సభ జరిగింది. ఈ సభకు పలు ప్రాంతాలనుండి ఇరవై వేల మంది ప్రజలు హాజరయ్యారు. వెల్లువగా వచ్చిన ప్రజానీకాన్ని చూచి స్వామి ఆకార్యకర్తలతో ఇలా అన్నారు –

"ఉంగుటూరు గ్రామస్థులగు ఆత్మ సోదరీ సోదరులారా! మీరందరు నాపై అత్యధికభక్తిశ్రద్ధలు గల వారని యెరుగుదును. నన్ను సత్కరించుటలో మీకు గల శ్రద్ధాసక్తులనెల్ల ఈ సభకు వచ్చిన జనుల నాదరించుటలో చూపవలయును. ఇదియే నాకు మీరు చేయవలసిన సేవ."

స్వామి అభిమతం ప్రకారం ఆ ఊరివారు ఏడు దినాలు అన్నపానాదులలో ఏ లోటు గలగనీయకుండా ప్రజలను చుట్టాలను వలె ఆదరించారు.

ఈ సభ జరుగుతున్న సమయంలోనే తేలప్రోలు గ్రామంనుండి ఆరుమళ్ళ సుబ్బారెడ్డి అనే ఒక యువకుడు వందలకొలది అనుచరులతో వచ్చి స్వామిని చాలా తీవ్రంగా ఎదుర్కొన్నాడు. "ఎవడీ స్వామి? ఇలాంటి కపట సాధువులవల్ల గదా లోకవంచన జరుగుతున్నది. ఇతడు బోధించే వెర్రి వేదాంతం వినడానికి ఇన్ని వేలమంది ఇక్కడ చేరడమా? ఈ పొట్టకూటి సాధువులు ఎంతకాలం ఇలా లోకాన్ని మోసగిస్తారు?" అంటూ అతడు స్వామిని నానావిధాల నిందించాడు. సభాస్థలిలో ఎన్నో వ్యతిరేక ప్రదర్శనలు చేశాడు. సాధుదూషణతో నిండిన 'కలికాల వేదాంతం' అనే పొత్తాన్ని గూడా అతడు సభలో పంచి పెట్టాడు.

ఇందుకు స్వామి అణుమాత్రమైనా చలించలేదు. సాక్షిమాత్రులై అతడు చేసే బీభత్సమంతా చూచారు. సభలోని జనులు అతని పట్ల కోపోద్రిక్తులయ్యారు. కాని స్వామి భావాన్ని గ్రహించి ఏ విధమైన ప్రతీకారానికీ పూనుకోకుండా ఊరకుండిపోయారు. అలా ఇష్టం వచ్చినట్లు శ్రీవారిని తూలనాడి సుబ్బారెడ్డి సభనుండి నిష్క్రమించాడు.

నాల్గు సంవత్సరాల తర్వాత అతడు పశ్చాత్తాపంతో వచ్చి స్వామి పాదాలకు సాష్టాంగ ప్రణామం చేసి క్షమించుమని వేడుకొన్నాడు. తరువాత స్వామికి భృత్యానుభృత్యుడై సభల్లో ముఖ్య కార్యకర్తగా వ్యవహరించాడు.

1950లో శ్రీ సుబ్బారెడ్డి స్వామిని బుద్ధునితో పోలుస్తూ 'అసంగానంద గౌతమబుద్ధులు' అన్న గ్రంథం రచించాడు. ఆ గ్రంథంలో ఆయన వ్రాసిన మాటలివి...

"శ్రీ అసంగానంద గౌతమబుద్ధుల క్షమాగుణ మెంతగా ప్రకాశించినదో నిరూపించదలచినదో అదియే ఒక మహాకావ్యమగును. తన్ను భిక్షకై పిలిచి సూకర మర్దనమును వడ్డించిన మహాపాపియగు చందుని క్షమించిన బుద్ధుడు సామాన్య పాపులను క్షమించుటలో ఆశ్చర్య మేమున్నది? అట్లే శ్రీ అసంగానందులును తమ సంఘములోనే వ్యతిరేక భావముతో తమ్ము విడిపోయి దుష్ప్రచారము చేసినవారిని, పతనముజెందిన వారిని ప్రేమతో చేరదీసి చక్కని మార్గములో పెట్టిన సందర్భము లెన్నియో కలవు. అనేక దినములు శుశ్రూష చేసిన భక్తుడొక్కడు అనుజ్ఞ పొందకయే స్వతంత్ర ప్రచారకుడుగా బయలుదేరి క్రమక్రమముగా పతితుడై గృహస్థుడుగా మారి కడకు పశ్చాత్తాప పడి రాగా శ్రీ అసంగానందులు ప్రేమతో ఆదరించి చిరునవ్వుతో ప్రక్కన నిలబడి ప్రాయశ్చిత్తము జేయించుటను నేనొకసారి

వ్యాసాశ్రమమున స్వయముగా చూచితిని. చోరవృత్తితో జీవితము గడపుచు కడకు విరక్తుడనై శ్రీ అసంగానందుల నాశ్రయింపగా భగవద్ధ్యానముతో మూడు సంవత్సరములు భిక్ష మెత్తుకొనుచు తీర్థాటనము జేయవలసిందిగా ఆజ్ఞాపించెననియు, అందుచేతనే ఇటుల తిరుగుచుంటిననియు ఒక భిక్షువు నాతో 1940 లో తాటిపర్తి (నెల్లూరు జిల్లా)లో స్వయముగా చెప్పెను.

అంత దూరమేల? 1936లో ఉంగుటూరు నందు జరిగిన సనాతన సభలో వందలకొలది జనసమూహముతో స్వాముల నెదుర్కొని వ్యతిరేక ప్రదర్శనములతో నానా బీభత్సము చేసిన నేను 1940 నాటికి భృత్యానుభృత్యుడనుగా మారిపోవుటలోనే వారి క్షమాగుణ మెంత పరాకాష్ఠ నొందినదో స్పష్టపడుచున్నది".

ఈ సుబ్బారెడ్డి తరువాత సన్న్యాసం స్వీకరించి సమత్వానంద స్వామిగా ప్రసిద్ధి వహించాడు. ఇలా స్వామిని మొదట ప్రతిఘటించి పిదప వారి మహానుభావతను గుర్తించి వారికి శిష్యులైన వారెందరో ఉన్నారు.

ప్రతిఘటించిన కవిరాజు

1940లో కృష్ణాతీరంలో వున్న దోనేపూడిలో ఓంకార సత్రయాగం జరిగింది. స్వామి శుష్కవేదాంతుల దుర్వాదాలు ఖండిస్తూ ఆత్మోన్నతి కవసరమైన ప్రబోధాలు చేశారు.

స్వామి అంటే గిట్టనివారు కొందరు కవిరాజు శ్రీత్రిపురనేని రామస్వామి చౌదరిగారికి స్వామిపై విరోధభావము కలిగేటట్లు చాడీలు చెప్పారు. కవిరాజు స్వామిని ఎదుర్కోవడానికి సరాసరి దోనేపూడికి వచ్చారు. ఒకే సభలో రెండు ఉపన్యాస వేదికలు ఏర్పడ్డాయి. "బ్రాహ్మణులు పౌరోహిత్యంతో

ప్రజలను పాడుచేస్తున్నారు. మలయాళ స్వామి వేదాంత సభల ద్వారా ప్రజలను వంచిస్తున్నాడు" అన్నది కవిరాజుగారి ఉపన్యాస సారాంశం. ఈ వ్యతిరేకులు స్వామిని అలా నిందిస్తూనే స్వామి భక్తులు నిర్వహించే సమారాధనలో భోజనం చేసేవారు.

వ్యతిరేకుల వాదాలు తీవ్రస్థాయి నందుకొన్నాయి. వారిని సభ నుండి బహిష్కరించాలని ప్రయత్నించే భక్తులను స్వామి వారించి ఇలా అన్నారు. "మనం ఇతరులకు చెడు కోరడం లేదు. మన కార్యక్రమాన్ని భగవంతుడే నిర్వహిస్తాడు. వారు నమ్మినదే సత్యమైతే వారట్లు ప్రకటించడానికి ఆటంక మేల? శ్రోతల నడ్డుపెట్టవద్దు. ఎవరి కెచట నచ్చిన వారి నక్కడికి వెళ్లి విననీయండి" అని చెప్పారు.

కోటయ్య అనే సాధు వొకడు స్వామిని దూషిస్తూ పద్యాలు వ్రాసి సభలో గానం చేశాడు. శిష్యులు ఈ సంగతి స్వామి దృష్టికి తెచ్చారు. స్వామి "మనలనెందరో పొగడుతూ కరపత్రాలు ప్రకటించారు. అప్పుడు మనకు లేనిది వచ్చిందా? ఇప్పు డొకరు తిట్టినంత మాత్రాన ఉన్నది పోతుందా?" అని అన్నారు. "స్వామీ! ఆ దుర్మార్గు డాపద్యాలను అచ్చుగూడా వేయించాడు" అని శిష్యులంటే " అచ్చు వేస్తే ఏమి? దానివల్ల పేదలైన ప్రెస్ పనివారు బ్రదుకుతారు. మన తప్పులు చూపేవారు మనకు అవసరమే. అట్టివారుంటే మనం జాగ్రత్తగా వుంటాము" అని స్వామి బదులు చెప్పారు.

ఇలా జరుగుతుండగానే దుండగులు ఒకనాటి రాత్రి యజ్ఞశాలకు నిప్పు పెట్టారు. దైవ కరుణచే ఎవరికీ ఏ ప్రమాదమూ జరుగలేదు. స్వామి శాంతి మార్గం వీడలేదు. ఈ అగ్ని పరీక్షలో నెగ్గారు.

చివరికి సభలోని మహిళావర్గంవారు కవిరాజుగారినీ, వారి అనుయాయులనూ సభనుండి నిష్క్రమింపజేశారు.

1951లో బహుభాషా కోవిదులు, విద్వదగ్రేసరులు అయిన శ్రీజొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు స్వామి కావించే ధార్మిక ప్రచారసరణికి ముగ్ధులై –

"ఇరువది యైదు సంవత్సరముల నుండి శ్రీ సద్గురు స్వాములవారు ఆంధ్రావనిలోని వివిధ ప్రాంతములలో సనాతన వేదాంత సభలు నిర్వహిస్తూ కావిస్తున్న ధార్మిక ప్రచారాలు, శ్రీ బుద్ధభగవానుని సంచార ప్రబోధాలను స్మృతికి తెస్తున్నవి" అని అన్నారు.

శ్రీ సత్యనారాయణమూర్తిగారు తాము రచించిన 'మహాభక్త విజయము'లో స్వామి చరిత్రను చేర్చి ప్రకటించారు.

బ్రహ్మవిద్యా పాఠశాల

గురుదేవులు ఆశ్రమంలో 1945 నవంబరులో ఒక బ్రహ్మవిద్యా పాఠశాల స్థాపించారు. గీత, ఉపనిషత్తులు, పాతంజల యోగ దర్శనం మొదలైన గ్రంథాలను అందులో పాఠ్యాంశాలుగా నిర్ణయించారు. విరక్తులై ఆశ్రమానికి వచ్చిన సాధువులు, సన్న్యాసులు, జిజ్ఞాసగల మహిళలు, జాతిలింగాది భేదం లేకుండా ఈ పాఠశాలలో బ్రహ్మవిద్య నభ్యసించే సదవకాశం కల్గింది. బాల్యంలో విద్యాభ్యాసం లేక ఆశ్రమానికి వచ్చి అక్షరాభ్యాసం చేసుకొని చివరికి గీతను పూర్తిగా కంఠస్థం చేసుకొన్న వయోజనులు కూడా ఉన్నారు.

స్వాతంత్ర్య సందేశం

1947 ఆగష్టులో దేశానికి స్వతంత్రత సిద్ధించింది. సెప్టెంబరులో ఒక సందేశం ఇస్తూ స్వామి ఇలా అన్నారు...

"గత మాసము పదునైదవ తేదినాడు స్వరాజ్యము వచ్చినందుకు దేశమంతట ఆబాలవృద్ధము మహానందముగా ఉత్సవములు, ఉపన్యాసములు, దానధర్మములు జరిపినారు... ప్రజ్ఞావంతు లనేకులు హర్షము వెలిబుచ్చినారు. ఇవన్నియు శుభసూచనలే. రోగ పీడితుడు రోగ విముక్తి గలిగినప్పు డెట్లు ఆనందమును పొందునో, ఆలాగున మాత్రమే జరిగినది. కాని దేనివలన రోగము గల్గినదో ఆ కీలకము తెలిసికొని మెలగినపుడే మరల ఆరోగ్యహాని కలుగకుండును. దీనిలోని రహస్యమిదే.... ప్రజలలోనూ, పాలకులలోనూ ఐకమత్యము లేనందుచేతనే పతనము సంభవించినదని కొందరు తెలిపినను అది చాలదు. మరియొక ముఖ్యకారణము కూడా కలదు. అది వర్ణాశ్రమ ధర్మముల నాధారము జేసుకొని కొన్ని జాతులకు మాత్రమే శాస్త్ర పఠనమునకును, అస్త్ర శస్త్రములు ధరించి యుద్ధము చేయుటకును అధికారము కల్పించుటయే. శారీరక మానసిక ప్రజ్ఞల ననుసరించి సర్వజనులకును తత్తదనుగుణ కార్యములలో ప్రవేశ మేర్పడవలయును. అప్పుడే భారత మాతను బంధించిన పిశాచము వదలిపోవును".

చాతుర్మాస్య వ్రతం

1948లో శ్రీవారు విజయవాడలోని కృష్ణలంకలో భక్తుల కోరికమేరకు చాతుర్మాస్య మహావ్రతం తలపెట్టారు. అప్పుడు దేశంలో రాజకీయ పరిస్థితులు దారుణంగా వున్నాయి. రజాకార్లు చెలరేగి ఘోర దుష్కృత్యాలకు పాల్పడిన

సమయ మది. ఆ క్లిష్ట పరిస్థితులలో విజయవాడ వంటి నగరములో వేలకొలది భక్తులతో కూడి చాతుర్మాస్యం నిర్వహించడం ఉచితం కాదని విన్నవిస్తూ పలువురు స్వామికి ఉత్తరాలు వ్రాశారు.

అందుకు స్వామి ఇలా అన్నారు - "మనము ప్రారంభింపదలచిన మహావ్రతమును భీరుత్వముతో మానుకొనుటయా? అట్లైన లోక మేమనగలదు? ఎందరో గృహస్థులు, స్త్రీలు, బాలురు బెజవాడ పట్టణములో నివసించుచుండ సాధువులము, సన్న్యాసులము, త్యాగులమై యున్న మనము దేహవిపత్తికి భయపడి నిశ్చిత ధర్మము నుండి చ్యుతి నొందుటయా? మనము ప్రారంభింపనున్నది దైవకార్యము. పరమర్షులనుష్ఠించిన పావనవ్రతము. ఇది ఆత్మశుద్ధికిని, లోకక్షేమమునకును, ప్రపంచశాంతికిని హేతువైనది. కాన పరమ కారుణికుడగు సర్వేశ్వరుడును, లోక పావనతత్పరులగు మహర్షులును మనల నాశీర్వదింపగలరు. ఇందు కేమాత్రము సందేహము వలదు".

6-7-1948వ తేదీన చాతుర్మాస్య మహావ్రతం ప్రారంభ మయింది. రెండుమాసాలు అవిచ్ఛిన్నంగా వ్రతం కొనసాగింది. ఇంతలో భారత ప్రభుత్వం సైనికచర్యతో రజాకార్లను అణచివేసింది. నైజామురాజ్యాన్ని స్వాధీనం చేసుకొనింది. చాతుర్మాస్యం నిర్విఘ్నంగా ఆత్మోన్నతి హేతువైన అనుష్ఠానాలతో, ప్రబోధాలతో సమాప్తమయింది. శ్రీవారిని 'మహర్షి' అని భక్తులు భక్తిభరితులై కొనియాడారు.

జాతి భేదానికి తావీకుండా తమ సంస్థలలో అందరికీ సమానావకాశాన్ని కల్గిస్తున్న శ్రీవారి పట్ల 1952లో హరిజనులు హృదయపూర్వకంగా తమ కృతజ్ఞత ప్రకటించారు.

సంఘసేవ

1951లో శ్రీవారు గుంటూరు జిల్లాలోని పొన్నూరులో బ్రహ్మవిద్యా ప్రచారానికై వెళ్లారు. రాయలసీమలో తీవ్రదుర్భిక్షం సంభవించిన రోజులవి. వ్యాసాశ్రమం రాయలసీమలోనిదే. అక్కడి ప్రజలు నానా బాధలు పడుతుంటే అక్కడినుండి వచ్చి సర్కారు ప్రాంతంలో వేదాంతబోధ చేస్తున్న స్వామిని చూడగా ప్రముఖ సంఘ సేవకులకు కొందరికి ఏవగింపు కల్గింది. వారు నేరుగా శ్రీవారిని సమీపించి "అయ్యా! రాయలసీమలో అన్నం లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మీరిక్కడ వేదాంత బోధ చేస్తున్నారు. అక్కడికి పోయి కాస్తా సంఘసేవ చేయరాదా? దీనజనోద్ధరణ మీ ధర్మం కాదా?" అని ప్రశ్నించారు.

అప్పుడు స్వామి "నాయనలారా! దయచేసి ఇప్పుడు రాయలసీమలో సేవ చేస్తున్న సంఘాలను పేర్కొనగలరా?" అని ప్రశ్నించారు. అందుకు వారు "అయ్యా! ఇప్పుడక్కడ జీవకారుణ్య సంఘం వారు అహోరాత్రాలు శ్రమిస్తూ అంబలి సత్రాలు నిర్వహిస్తున్నారు. అన్నార్తులను ఆదుకొంటున్నారు" అని బదులిచ్చారు.

అప్పుడు స్వామి "ఓహో! అట్లనా? అయితే సంతోషం! మీరు పేర్కొన్న సంఘం మా ఆశ్రమ సంస్థల్లో ఒక భాగమే. ఆ సంఘ సేవకులు మా శిష్యులే" అని చెప్పారు.

అది విని సంఘసేవకులు ఆశ్చర్యచకితులయ్యారు. జీవకారుణ్య సంఘ నిర్వాహకులు శ్రీ కారుణ్యానందస్వాములవారు స్వామి శిష్యులని గ్రహించి తాము త్వరపడి అన్న మాటలకు పశ్చాత్తాపం చెందారు.

మతయోగ సమన్వయం

ఒక భక్తుడు వ్యాసాశ్రమం సందర్శించి “స్వామీ! మీ ఆశ్రమంలో మతకర్త లందరి చిత్రాలూ ఉన్నాయి. అందరినీ పూజిస్తున్నారు. ఇంతకూ మీ మతమేది?” అని ప్రశ్నించాడు.

అందుకు స్వామి “నాయనా! ఈ మతకర్తలందరి మతులకూ ఆవల నుండి ఏది వీరి మతులను ప్రకాశింపజేస్తున్నదో అదే మా మతం. అది దేశకాల ప్రాంతాలకు లోబడేది కాదు. కేవల జ్ఞాన స్వరూపమైనది” అని సమాధానం చెప్పారు.

అట్లే కర్మ – భక్తి – జ్ఞాన యోగాలకు కూడా స్వామి చక్కని సమన్వయం ప్రతిపాదించారు. “గోవుకు నాల్గు పాదాలు. వాటిలో దేనికి కీడు కల్గినా ఆవు నడక కుంటుపడుతుంది. ఆధ్యాత్మిక సుస్థితికి కర్మ– భక్తి– ధ్యాన – జ్ఞాన యోగాలు నాలుగూ అవసరమే. అందులో దేనికి లోపం కల్గినా పూర్ణత్వం సిద్ధించదు” అని శ్రీవారు చెప్పేవారు.

యుగభేదాలు

యుగాల పట్ల మనవారికి గల మూఢవిశ్వాసాలు దేశదుఃస్థితికి కారణమయ్యాయని శ్రీవారు చెప్పారు. పుణ్యాత్ములు ఏ కాలానికి చెందినవారైనా కృతయుగ జీవులే అనీ, పాపాత్ములు ఎప్పుడున్నా కలియుగ జీవులే అనీ స్వామి ఉద్ఘోషించారు. ‘కలి కలి’ అని జపించి కలుషాత్ములై పోకూడదు. మనం కృతయుగజీవులమే అన్న విశ్వాసంతో సత్ప్రవర్తన కల్గి వున్నవారు బంధవిముక్తు లవుతారని స్వామి ఉపదేశించారు. యుగభేదాలు మనప్రవర్తనపై ఆధారపడివుంటాయి. కాలదేశాల ననుసరించి

వుండవు. ఆత్మోన్నతి కల్గించే ఇలాంటి ప్రబోధాలతో శ్రీస్వాములవారు భక్తులను ఎంతో ఉత్తేజపరచారు.

గ్రంథరచన

ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణలో వ్యాసాశ్రమం కావించిన కృషి నిరుపమానం. శ్రీవారు మాసపత్రికలో శరపరంపరగా వ్యాసాలు ప్రకటిస్తూ వచ్చారు. ఎన్నో ఉపదేశవాక్యాలు ప్రచురించారు. ఆ రచనలన్నీ తరువాత గ్రంథరూపం దాల్చాయి. స్వబోధసుధాకరము, ధర్మసేతువు, ఈశ్వరకృప, ప్రశ్నోత్తరమాణిక్యమాల, నాల్గు సంపుటాలుగా వెలువడిన ఉపదేశామృతము మొదలగు పుస్తకాలన్నీ ఇలా వచ్చినవే.

గీతకు విపులవ్యాఖ్య వ్రాసి స్వామి 1945లో ప్రచురించారు. శుష్కవేదాంత తమోభాస్కరం లాగా ఇది కూడా ఎక్కువ ప్రజాదరణ పొందింది. అంతేకాక మూలగీత, స్థూలాక్షరగీత, తాత్పర్యగీత, మహాభగవద్గీత ఇత్యాదిగా గీతను ఎన్నో రూపాల ప్రకటించారు.

‘బాలయోగిని’ అన్న పేరుతో ఆధ్యాత్మికపరమైన ఒక కల్పిత జీవితగాథను స్వామి రచించారు. శ్రీవారి జీవితం ఇందులో ఛాయామాత్రంగా గోచరిస్తుంది. వర్ణ వ్యవస్థలోని ఆంతర్యాన్ని వివరిస్తూ ‘లోకోద్ధారకం’ అన్న గ్రంథం కూడా వ్రాశారు. సంఘసంస్కరణ వాదులు తప్పక చూడవలసిన గ్రంథమిది.

నారదభక్తి సూత్రాలు, కఠోపనిషత్తు, ముండక, మాండూక్యోపని షత్తులు – వీటికి స్వామి స్వయంగా వ్యాఖ్యలు వ్రాసి ప్రకటించారు. లోకోత్తరమైన తమ సదాశయాల నన్నింటినీ క్రోడీకరించి సంస్కృతంలో ఛందోబద్ధం

కావింపజేసి పదునెన్మిది అధ్యాయాలు కల 'శ్రీమలయాళ యతీంద్ర గీత'ను వెలువరించారు. స్వామి ఉపన్యాసాలు, వ్యాసాలు 'ధర్మోపన్యాసము'లన్న పేరుతో నాలుగు సంపుటాలుగా వెలువడ్డాయి.

యోగవాసిష్ఠం, ఆత్మపురాణం, అనుభూతి ప్రకాశం, పాతంజల యోగదర్శనం, వివేకచూడామణి, శంకరవిజయం, గురుగీత, అష్టావక్రగీత మొదలైన సంస్కృత గ్రంథాలకు ప్రముఖ విద్వాంసులచేత తెల్గులో వ్యాఖ్యలు, వివరణలు వ్రాయించి ప్రకటింపజేశారు.

'బుద్ధచర్య, వేదాంత బాలబోధం' మొదలైన గ్రంథాలను ఇతర భాషల నుండి అనువదింపజేసి ప్రకాశింపజేశారు. ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, దాసబోధ మొదలైన అపూర్వ గ్రంథాలను పునర్ముద్రింపజేసి సాధకులకు మహోపకారం కావించారు. శ్రీసాయం వరదదాసు వంటి శిష్యసత్తములు వ్రాసిన గ్రంథాలు గూడా బహుళప్రచారం పొందాయి.

శ్రీవారి గ్రంథాలలో కొన్ని ఇటీవల ఆంగ్ల హిందీ భాషలలోనికి అనూదితాలై ప్రచురింపబడ్డాయి.

అనుభూతిప్రకాశ మనే గ్రంథాన్ని అనువదించి ఆశ్రమానికి సమర్పించిన విద్వదగ్రేసరులు శ్రీబంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారు గురుదేవుల కృషిని ప్రశంసిస్తూ గ్రంథపరిచయములో ఇలా అన్నారు –

"ఇట్టి గ్రంథములు తెలుగులోనికి రావలసిన వెన్నో కలవు. తగిన దోహదమిచ్చి పండితులచే తెనిగింపజేయుట కాంధ్రలోకము యత్నించుట ఆవశ్యకము. అందనేక గ్రంథములకు శ్రీవ్యాసాశ్రమమువారు తెనింగింపించి

ప్రచురించుచుండుట చాల శ్లాఘ్యము. శ్రీస్వాములవారనేక మండలములలో వేదాంతమతమును స్వవాక్యోపన్యాసముల ద్వారా, స్వగ్రంథముల ద్వారా ప్రచారము చేసి లోకోపకారమునకు కంకణము కట్టి యున్నారు. ఇంతేకాక విద్యాసంస్థలను మఠమున నెలకొల్పి విద్యార్థులను ఉత్తీర్ణులను చేయుచున్నారు. ఈ లాగున ఇతర సన్యాసులును ఒనర్చుచుండిన దేశ మెంతయో బాగుపడగలదు. బ్రహ్మతత్త్వమును స్త్రీ పురుషులెరింగి మోక్షము పొందగలరు".

శ్రీ పి.వి. నరసింహారావు గారు (మాజీ భారత ప్రధాన మంత్రి) 1984లో స్వామి శతజయింతి సందర్భంగా ఒక సందేశం పంపుతూ శ్రీవారి గ్రంథప్రచురణ కృషిని ఇలా ప్రశంసించారు ....

"నేను ఏర్పేడు ఆశ్రమం పలుసార్లు సందర్శించాను. పవిత్ర గ్రంథాలతో సహా వివిధాధ్యాత్మిక విషయాలపై ఆశ్రమంవారు తెలుగులో ప్రచురించిన గ్రంథాలు నన్నెంతో ప్రభావితుణ్ణి చేశాయి. తెలుగు ప్రజల ఆత్మోన్నతికి ఇంత గొప్పసేవ చేసిన మరొక సంస్థ నా దృష్టికి రాలేదు".

ఆశ్రమ సంపదల వినియోగం

భక్తజనుల సహకారంతో ఆశ్రమం అన్ని విధాలా సంపన్నమై దినదినాభివృద్ధి పొందింది. అనేక భవనాలు నిర్మింపబడ్డాయి. వ్యవసాయశాఖ, పశుపోషణశాఖ, ముద్రణశాఖ ఇత్యాదులను పర్యవేక్షించడానికి తగిన వ్యక్తులు నియమింపబడ్డారు.

ఆశ్రమసంపదల వినియోగం ఎలా జరుగుతుందో తెలియపరుస్తూ స్వామి 1942లో ఇలా ప్రకటించారు ...

“శ్రీ వ్యాసాశ్రమ స్థిరచరాస్తులన్నియు మూడు భాగములు కాగా అందొక భాగము సంస్కృత పాఠశాల యందలి ఉపాధ్యాయులు, విద్యార్థుల యొక్క నిర్విఘ్నపోషణమునకును, మరొక భాగము తీర్థయాత్రా పరులగు సాధువులకు, అతిదీనులగు పేదలకు అన్నదానాదు లొనర్చుటకును, తక్కిన భాగము ఆశ్రమమున నుండి బ్రహ్మనిష్ఠ జేయు సంయమపరుల భోజనాది సౌకర్యములకును వినియోగింపబడును”.

షష్ఠ ప్రకరణం

కన్యాగురుకులస్థాపనం

ఆశ్రమంలో సంస్కృత విద్యాలయం ప్రారంభమైన కాలంనుండి కొందరు బాలికలు సంస్కృతం నేర్చుకొంటూ వచ్చారు. గీతాది గ్రంథాల పారాయణంలో వారు ముందంజ వేశారు. ఎక్కువమంది మహిళలకు సంస్కృతంలోనూ, బ్రహ్మవిద్యలోనూ ప్రవేశం కల్గించాలన్న దృష్టితో స్వామి ఆశ్రమంలోనే ఒక కన్యాగురుకులం నెలకొల్పదలచుకొన్నారు. వారి సంకల్పం కార్యరూపం దాల్చింది. కన్యాగురుకుల నిర్మాణం భక్తుల సహకారంతో త్వరలోనే పూర్తి అయింది.

1-12-1955వ తేదీన కన్యాగురుకులానికి ప్రారంభోత్సవం జరిగింది. ఆ సమయంలో స్వామి అన్న మాటలివి...

“ఈ గురుకులమున విద్యనభ్యసించిన కన్యలెల్లరు వేద కాలమునాటి యోగినీమణులవలె పరమ పవిత్ర చరిత్రలై బ్రహ్మవాదినులుగా తయారు కావలెనని మా ఆశయము... శ్రీదయానందుడు వేదాధ్యయనాది సమస్తకార్యము లొనర్చుటకు స్త్రీలకు, ద్విజేతరులకు గూడ అర్హత కలదని సప్రమాణముగా చాటిన మహనీయుడు. ఆ పవిత్రమూర్తి నిర్దేశించినట్లు బ్రహ్మచర్యము పాటించుచు, వేదాధ్యయనము చేయుచు అగ్నికార్యము నడపుచు ఆదర్శ యోగినీ మణులవలె మెలగుట ఉత్తమ పద్ధతి.

లేదా, శ్రీశారదారామకృష్ణులవలె గృహస్థు లయ్యు పవిత్ర భావముతో మెలగుచు నిరంతరము భగవదుపాసనాపరులై లోకకల్యాణార్థము తమ జీవితముల నంకితము గావించుట రెండవ పద్ధతి.

అట్లాచరింప జాలనివారు శ్రీకస్తూరిబా – గాంధీ మహాత్ముల వలె గృహస్థులై కొంతకాలము విషయసుఖముల ననుభవించినను తరువాత బ్రహ్మచర్యము పాటించుచు ఆదర్శవానప్రస్థులై నిరంతరము లోకసేవా పరాయణులై మెలగుట మూడవ పద్ధతి.

ఈ మూడు మార్గములలో ఏదో ఒక మార్గము నిందలి విద్యార్థిను లనుసరింపవలెనని మా అభిప్రాయము. కన్యాగురుకులములో చేరువారు నిరాడంబరజీవితము గడపవలెను. సువర్ణాభరణాదులు ధరింపరాదు. శీలమే స్త్రీలోకమునకు పరమ భూషణము".

ఓంకారోపాసన

కృష్ణాజిల్లాలోని తాడేపల్లి ప్రాంతంలో స్వామి శిష్యులు అనేకులు ప్రణవోపాసనాది సాధనలను అనుష్ఠించడం ప్రారంభించారు. అది చూచి కొందరు సనాతనులు "స్త్రీలు, ద్విజేతరులు ఓంకారోపాసన చేయరాదు" అని ఆక్షేపించారు. శ్రీవా రొకసారి ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆ సనాతన పండితులు స్వామిని సమీపించి తమ ఆక్షేపణ తెలియజేశారు.

అప్పుడు స్వామి ఆ పండితుల సమక్షంలోనే తమ శిష్యులను "అక్షరాభ్యాసకాలంలో మొదట మీరు ఏమి నేర్చుకొన్నారు? అది మీకు నేర్పింది ఎవరు?" అని ప్రశ్నించారు. అందుకు శిష్యులు "స్వామీ! ఓం నమః శివాయ సిద్ధం నమః' అన్న మాటలతో మా చదువు ప్రారంభించాము. ఈ పండితుల తాతలు, తండ్రులే మా చిన్ననాటి గురువులు" అని బదులు చెప్పారు.

అప్పుడు స్వామి ఆ సనాతనులతో "చూచారా? మీ పెద్దలు బాల్యంలో వారికి నేర్పిన చదువు వారు మరచిపోయారు. దాన్ని మళ్లీ జ్ఞాపక పరచడానికి

మేము వచ్చాము. అంతేకాని క్రొత్తగా మేము ఏమీ బోధించలేదు" అని చెప్పారు. అంతటితో ఆ విద్వాంసులు నిరుత్తరులై స్వామికి ప్రణమిల్లారు.

స్వానుష్ఠానం

లోకోద్ధరణకొరకు శ్రీవారు చేసిన సేవాకార్యక్రమా లన్నీ ఒక ఎత్తు అయితే లోకోత్తరమైన స్వానుష్ఠానంలో వారు చూపిన శ్రద్ధ మరొక ఎత్తు. అనుష్ఠానాని కిచ్చిన ప్రాధాన్యం మరి దేనికి వారివ్వలేదు.

తపశ్చర్యాకాలంలో ఎలాంటి కఠిన నియమాలు పాలించారో, ఆ నియమాలు తపస్సిద్ధి పొందిన తర్వాత కూడా వారు వదలలేదు. సోమవారం, ఏకాదశి, మాసశివరాత్రి, కృత్తికానక్షత్రం... ఈ దినాలలో స్వామి ఉపవాసం పాటించేవారు. తురీయాశ్రమం స్వీకరించేవరకూ ఈ ఉపవాసానుష్ఠానం కొనసాగింది. తర్వాత ఏకాదశీవ్రతం మాత్రం జీవితాంతం వారు కొనసాగించారు.

స్వామి సదా ఏకవస్త్రమే ధరించేవారు. జీవితం చివరిదినాలలో శరీరం స్వాస్థ్యం తప్పినప్పుడు కొలది మాసాలు తప్ప తక్కిన కాలంలో ఎన్నడూ మంచం, పరుపు, దిండు వాడి యెరుగరు. చాపమీదనో, బల్ల మీదనో తమ భుజమే దిండుగా శయనించేవారు.

ఆసేతుశీతనగం భారతావనిని కాలినడకతో పర్యటించినప్పుడూ, తదితరకాలాలలోనూ వారు పాదరక్షలు ధరించలేదు. మండుటెండల్లో సైతం గురుదేవుని చేత పావుకోళ్లు ధరింపజేయడానికి శిష్యులు చేసిన ప్రయత్నం ఫలించలేదు.

ఒకసారి స్వామిని కొందరు "అయ్యా! మీరింకా ఉపవాసాదులు అనుష్ఠిస్తున్నారే? తపస్సిద్ధులకు ఇవి ఎందుకు? ఎల్లకాలం అన్నం వండుతూనే వుంటే ఇక తిని తృప్తి పొందే దెప్పుడు?" అని ప్రశ్నించారు.

స్వామి వారి కిచ్చిన సమాధానం ఇది – "నాయనలారా! నిరతాన్నదాన సత్రాలలో అనవరతం వంటలు కొనసాగుతూనే వుంటాయి. అంత మాత్రాన అక్కడ వంటలు చేసేవారు తినలేదని అర్థమా? తాము తిని ఇతరులకోసం వారు వంటలు చేస్తుంటారు. ఇతరులకు ఆదర్శ ప్రాయమైన ఆచరణ విడనాడరాదు. జ్ఞాని లోకశ్రేయస్సుకు భంగకరంగా వర్తించరాదు".

అపరిగ్రహం

ఆశ్రమ నిర్వహణకై భక్తులు తమంత తాముగా భూరిద్రవ్య దానం చేసేవారు. అది చూచి కొందరు "మలయాళస్వామి మహామాంత్రికుడు. మంత్రప్రభావంతో ధనాకర్షణ, జనాకర్షణ చేస్తున్నాడు" అని చెప్పుకొన్నారు. ఇది విని స్వామి "అవును. నా వద్ద రెండు మంత్రాలు కలవు. అవి దాచవలసిన మంత్రాలు కావు. ఎవరైనా వాటిని నేర్చుకొని అనుష్ఠించవచ్చు. ఒకటి, ముందుకు వేసిన కాలు వెనుకకు దీయకుండుట, రెండు, ఒకరి చేయి క్రింద చేయి పెట్టకుండుట. నా చిన్నతనంలో ఇల్లు వదలిననాటినుండీ నేనీ రెండు మంత్రాలూ అనుష్ఠిస్తున్నాను. ఈ మంత్రాలు ప్రయోగిస్తే ఎలాంటి కార్యాలనైనా సులభంగా సాధించవచ్చు" అని చెప్పారు.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు, లోకసభ స్పీకరు శ్రీఅనంతశయనం అయ్యంగారు మొదలైన రాజకీయ నాయకులు ఆశ్రమానికి వచ్చి "స్వామీ! మీకేదైనా కావలసి వుంటే చెప్పండి, చేస్తాము"

అంటే స్వామి "నాయనలారా! మంచిది. మేము మొదటినుండి భగవంతునిపై భారం వేసి జీవిస్తున్నాము. ఆ కరుణామయుడే మాకవసరమైన దేదో సమకూర్చగలడు" అని చెప్పేవారు.

నిరాడంబరత

ఆశ్రమ ప్రారంభదినాలలో పూజామందిరం, నిష్ఠాశ్రమం – ఇవి రెండూ మట్టిగోడలతో, పూరి కప్పుతో నిర్మించబడ్డాయి. తరువాత ఎన్నో ఉన్నత భవనాలు వెలిశాయి. కాని పైరెండు కుటీరాలు మాత్రం అలాగే వుండిపోయాయి. ఆధునిక పద్ధతిలో వాటిని పునర్నిర్మించడానికి అనుమతించండని కోరిన భక్తులతో శ్రీవా రంగీకరించలేదు.

శ్రీవారి నిరాడంబరత్వాన్ని ప్రకటించే మరొక సంఘటన ఇక్కడ గమనింపదగివున్నది. ఒక మద్రాసుభక్తుడు మూడడుగుల ఎత్తుగల ఆయిల్ పెయింటు పటములో స్వామి ధ్యానంలో ఉన్నట్లు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు వారిపై పుష్పాలు పోస్తున్నట్లు చిత్రింపజేసి ఆ చిత్రాన్ని ఆశ్రమానికి సమర్పించి వెళ్లాడు. శ్రీవారు మరునాడు ఆ పటాన్ని అందరి ఎదుటకూ తెప్పించి "ఆహా! ఎంత బాగున్నది! ఓహో! ఎంత సుందరముగా కుదిరినది!" అని మెచ్చుకొంటూనే ప్రేము ఊడగొట్టించారు. చిత్రితవస్త్రాన్ని వేరు చేయించి చేతికి తీసుకొన్నారు. అందరూ ఆశ్చర్యంతో చూస్తూవుండగా దానిని ముక్కలు ముక్కలుగా చించి తామరమడుగులో కలిపి రమ్మని ఆదేశించారు. ఆపై ఇలా అన్నారు ...

"ఆడంబరములకు, అసత్యములకు, అతిశయోక్తులకు ఏమాత్ర మవకాశము కల్పింపకుడు. తనలో లేనివి కల్పించి చెప్పుకొన్నచో ఉన్నవి

ఊడిపోవుటే కాక రానున్నవి కూడ రాకపోవును. త్రిమూర్తులు నాకు ప్రత్యక్ష మగుటను వారు చూచిరా? ఇట్టి కల్పిత చేష్టల చేతను, అసత్యవచనముల వలనను బ్రహ్మవిద్య పతనమగు నని మరువకుడు".

శిష్యశిక్షణ

శిష్యులను తీర్చిదిద్దడంలో స్వామి చూపిన నేర్పు, ఓర్పు వర్ణనాతీతం. ఆశ్రమంలో నియమం తప్పి చరించేవారికి ఉపవాసాది శిక్షలు విధించేవారు. తీవ్రాపరాధులను ఆశ్రమంనుండి బహిష్కరించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

శిక్షణ లేని శిష్యుడు రాణించడంటూ స్వామి ఇలా బోధించేవారు...

"కొండగుట్టలలో పడివున్న రాతిని తెచ్చి శిల్పి ఎంతో నేర్పుతో చెక్కి చక్కని విగ్రహముగా చేయును. ఎన్నో సుత్తి దెబ్బల కోర్చినగాని ఆ శిల పూజార్హము గాదు. అట్లే శిష్యుడును గురువుచెంత క్రమశిక్షణ పొంది కఠిన నియమముల కోర్చి ప్రాయశ్చిత్తముల ననుభవించిన గాని లోకమున గౌరవ మొందలేడు. పుటము వేయని బంగారమునకు వన్నె రాదు గదా!"

ధ్యానాది వేళల్లో నిశ్శబ్దత పాటించాలి. పుస్తకాలు, కళ్లజోడు పెట్టెలు మూసేటప్పుడు శబ్దం వినపడగూడదు. భోజన కాలంలో మాటలాడరాదు. సోమరితనం పనికిరాదు.

సాయంసమయంలో భోజనానికి గంటకొట్టే విద్యార్థి ఆశ్రమస్థుల నుద్దేశించి నిత్యమూ ఇలా బిగ్గరగా ప్రబోధవచనాలు పలుకుతాడు ...

" దైవాత్మస్వరూపులారా! కోపము చేయకూడదు. కోపము పాపము. శాంతము దైవస్వరూపము. ఆశ్రమావరణలో చుట్ట, బీడి, సిగరెట్టు వగైరా

త్రాగరాదు. పరిసరాలను శుభ్రముగా ఉంచవలెను. మీరందరు శాంతస్వరూపులనియు, కరుణాస్వరూపు లనియు మరువకుడు."

ఈ ప్రబోధం క్రొత్తగా ఆశ్రమానికి వచ్చిన వారికి చక్కని హెచ్చరిక.

స్వామి శిష్యుల కిచ్చిన క్రమశిక్షణ విషయమై ఒక సందర్భములో శ్రీ సీతారామయతీంద్రు లిలా అన్నారు ...

"శ్రీస్వాములవారి ఆశ్రమములో శిష్యులకు వారిచ్చిన క్రమశిక్షణ చాల మెచ్చుకొనదగినది. సామాన్యముగా ఏ ఆశ్రమములోనూ అంత క్రమశిక్షణ ఉండదనుటలో అతిశయోక్తి లేదు. ఆ క్రమశిక్షణకు నేను ముగ్ధుడ నగువాడను".

సంఘసంస్కరణ

పూర్వం హిందూ సమాజాన్ని పాలించిన రాజులు మనుస్మృతిని అనుసరించేవారు. అతిదీర్ఘకాలం ఈ స్మృతి సమాజాన్ని శాసించింది. ఇటీవల ఈ స్మృతిలోని శాసనాలు ఎంతవరకు సమంజసమైన వన్న విషయంలో అనేక వాదోపవాదాలు చెలరేగాయి. ఈ విషయమై స్వామి అభిప్రాయ మేమిటో గమనిద్దాము.

"బ్రహ్మ విషయమై చూచిన మనువు అతీంద్రియజ్ఞానము గలవాడనియు, అఖండ బ్రహ్మ నిష్ఠుడనియు ఎట్టివారికైన గోచరింపక పోదు. ఇందుచేత మనువు మహర్షి సత్తముడనియు, పరమపూజ్యుడనియు, బ్రహ్మ నిష్ఠాగరిష్ఠుడనియు గ్రహించి నమస్కరించుట శ్రేయోదాయకము. జాతివిషయమై, సంఘ విషయమై మనుస్మృతి యందలి భాగము క్రూర పిశాచములు గూడ చెప్పనట్లును, పరమ నీచులు గూడ తలంపనట్లును,

పరమ క్రూరులు గూడ చేయనట్లును వ్రాయబడి యున్నది. ఈ విషయము మనుమహర్షిచే వ్రాయబడినది కాదనియు, మధ్య కాలమున జాతి వైషమ్యావేశోద్రేక పూరితహృదయు లెవరో క్రూరభావనతో చేసి యుండవచ్చుననియు పలువురు నుడివిరి. శ్రీదయానందులు కల్పిత శ్లోకములు ఫలానివని చూపియున్నారు. మనువు అపారమహిమ గల బ్రహ్మజ్ఞుడని మనము తలంపవలెను. క్షీర నీర న్యాయము ననుసరించి సముచితమై, సర్వజన సమ్మతమై, జనుల కాదరణీయమగు ముఖ్య విషయమును మాత్రము గ్రహించిన చాలును".

1959లో ఒకసారి అస్పృశ్యతా నివారణ ప్రచారక సంఘానికి చెందిన హరిజనులు కొందరు స్వామి చెంతకు వచ్చి అస్పృశ్యతను గూర్చి విపులంగా చర్చించారు. వారడగిన ప్రశ్నలకు స్వామి ఇచ్చిన సమాధాన సారాంశ మిది.

"సోదరులారా! హరిజనులు అస్పృశ్యులుగా వెలి వేయబడుటకు గోహింస కారణం కావచ్చు. మీరు ఈ దోషం మీలో లేకుండా చేసుకోవాలి. హిందూమతంలో గోమాంసభక్షణం దోషంగా భావింపడుతున్నది. గోహత్యాది పాప కృత్యములు, మద్యపానాది దురభ్యాసములు మానండి. శ్రమపడి విద్య నభ్యసించండి. మీ సంతానాన్ని విద్యావంతులుగా, సదాచారపరులుగా తీర్చిదిద్దండి. అంటు జాడ్యములను పోలిన దురాచారములకు దూరమైతే, మీరు సవర్ణులతో సమానస్థితి పొందగలరు. సవర్ణ హిందువులు కూడా కులానికి కాక, గుణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే భారతదేశం ఔన్నత్యం పొందుతుంది. లేకపోతే ఉభయులకూ శ్రేయస్సు లేదు".

ఒకసారి పశ్చిమ గోదావరి జిల్లాలో సనాతన వేదాంత సభలు జరిగాయి. అక్కడ రాజ కుటుంబానికి చెందిన స్త్రీలు ఘోషా సంప్రదాయం పాటించేవారు. వారికి స్వామి ప్రబోధం వినాలన్న అభిలాష ఉండేది. సభలో వారు బహిరంగంగా పాల్గొనలేకపోయారు. కొందరు వారికి తెర కట్టాలని సూచించారు.

ఇది గ్రహించిన స్వామి ఘోషా పద్ధతి సారహీనమైన దురాచారమనీ, అందులో ఎలాంటి ధర్మతత్త్వమూ లేదనీ, మనశ్శుద్ధికి హేతువైనదే నిజమైన ధర్మమనీ, ఇంద్రియ నిగ్రహమే ఆత్మశుద్ధికి హేతువుగాని బాహ్యకృత్యాలు కావనీ, బాహ్యాచారాలు ఎన్ని ఉన్నా భావశుద్ధి లేకపోతే ఈశ్వర సాక్షాత్కారం సిద్ధించదనీ, ఘోషా పద్ధతి స్త్రీల ఆత్మోన్నతికి నిరోధకమనీ నిరూపిస్తూ గంభీరోపన్యాసం చేశారు. అంతటితో మూఢ విశ్వాసం పటాపంచలైంది. నాటినుండి రాజకుటుంబాల స్త్రీలు సభల్లో నిరాటంకంగా పాల్గొన్నారు.

విగతభర్తృకలైన స్త్రీలకు పునర్వివాహం సముచితమా అన్న విషయంపై స్వామి ఇలా అభిప్రాయపడ్డారు. "బ్రహ్మ చర్యానుష్ఠానములో నిలకడ లేక గర్భ విచ్ఛేదాది పాపకృత్యాలు చేయడం కంటే స్త్రీలు పునర్వివాహం చేసుకోవడమే మంచిది. ఇందులో పాప మేదీ లేదు. అయితే పునర్వివాహం ఉత్తమ పక్షం కాదు. చెడిపోయి ఆత్మహత్యాదులకు పాల్పడటం కంటే ఇది మేలని చెప్పవలసినదే కాని పవిత్ర ధర్మమని అంగీకరింపరాదు. బాల్య వివాహం, వరకట్నం వంటి దురాచారాలు కూడా వర్జింపదగినవే".

చరాచర సుఖాభిలాషి

"సర్వే జనాస్సుఖినో భవన్తు" అని పెద్దలు అభిలషిస్తారు. సర్వ సమదర్శనులైన గురుదేవులు కేవలం మానవాళి సుఖాన్నే గాక,

చరాచరాత్మకమైన సకల ప్రాణుల సుఖాన్నీ అభిలషించారు. వ్యాస రచనల క్రింద తమ పేరు వ్రాయడానికి ముందు 'చరాచర సుఖాభిలాషి' అని వ్రాసేవారు.

అతి దుర్భిక్ష కాలంలో ఒకసారి అర్ధరాత్రి వేళ కొందరు గుంపుగా వచ్చి, "స్వామీ! అన్నపూర్ణ దర్శనమై రెండు రోజులైంది. ఆకలి బాధ భరింప లేకున్నాము" అని మొరపెట్టుకున్నారు. స్వామి వెంటనే విద్యార్థులకై ప్రత్యేకించబడిన చద్ది అన్నమును వారికి కడుపు నిండా పెట్టించారు. లెక్కించగా వారు మొత్తం నలభై రెండు మంది ఉన్నారు. మరునాటి మధ్యాహ్నం కూడా వారు తృప్తిగా భోంచేసి వెళ్లారు.

అప్పుడు స్వామి శిష్యులతో "క్షుద్బాధ భరింపరానిది. అది అనుభవించిన వారికే తెలుస్తుంది. తీర్థ యాత్రా కాలంలో నేను పలుసార్లు ఆ బాధ అనుభవించాను. స్వానుభవంతో కాని సంగతి బోధపడదు" అని చెప్పారు.

ఆశ్రమంలో భిక్షలు ఏర్పాటయినప్పుడు స్వామి గోవులకు, ఇతర పశువులకు కూడా తవుడు వంటి బలకరమైన పదార్థాలతో భిక్ష జరిపించేవారు. గోకులాష్టమి నాడు విద్యార్థులు కొండల నుండి తెచ్చిన పచ్చి గడ్డితో పశువులకు సమారాధన జరిగేది. గోవులు దురద తీర్చుకోవడానికై గోశాల వద్ద, తామర కొలను చెంత స్వామి రాతి కంబాలు నాటించారు.

మాఘ మాసంలో ఒకసారి గురుదేవులు శిష్యుణ్ణి పిలిచి, "ఏమి రాజయ్యా! సాధువులకు, గోవులకు భిక్ష చేస్తారు. వరాహాలకు కూడా భిక్ష చేయవలెను" అని చెప్పారు. వెంటనే పరిసర గ్రామాలలో పందుల మందలన్నీ

ఆశ్రమానికి ఆహ్వానించబడ్డాయి. సంకటి, చద్ది అన్నము, తవుడు మొదలైన రుచికర పదార్థాలతో తొట్లు నింపారు. సూకర సంఘాలు పులకించి ఘుర్ఘురారావం చేస్తూ కడుపారా కుడిచాయి. ఆ దృశ్యం అందరికీ అమందానందం కలిగించింది.

ఆశ్రమంలో విషసర్పాలు కనిపించినా చంపరాదని స్వామి కట్టడ చేశారు. ఏడడుగుల పొడవైన ఒక పట్టుకారుతో వాటిని పట్టి దూరంగా వదలి వేయడం జరిగేది. మామిడి కాయలు మొదలైనవి కోసేటప్పుడు ఆకులు రాలకుండా జాగ్రత్త వహించాలని స్వామి వారి ఆదేశం.

స్వామి ఒక సందర్భంలో అరటి యాకులలో ఇక భోజనం చేయరాదు అని నిర్ణయించుకొన్నారు. కారణ మేమిటో వారి మాటల్లోనే విందాం.

"హృదయ మతి నిర్మలముగను, కోమలముగను ఉన్నప్పుడు ఒక చెట్టు నఱకుటకు గూడా ఇష్టముండదు. ఒకసారి నెల్లూరులో విఖ్యాతమగు ఒక రెడ్డి కుటుంబమున భిక్ష జరిగెను. భోజనమునకు లేత అరటి యాకుల నుపయోగించిరి. ఆయాకు లన్నియు వారి తోటలోనివే. ప్రాతఃకాలమున మేమచటికి స్నానమునకు వెళ్లునప్పుడు ఆకదళీ వనమంతయు పరమానంద భరితమై పచ్చని యాకులతో చిరునవ్వులు చిందుచున్నట్లు తోచెను. మఱల సాయం స్నానమునకు పోయి ఆకులన్నియు కోయబడుటచే అందుండి కారెడు ద్రవమును చూడగా ఆ చెట్లన్నియు మిక్కిలి దుఃఖముతో నేడ్చుచున్నట్లు తోచెను. అప్పటి నుండి అరటి యాకులలో భోజనము మానితిని."

లక్ష్యసిద్ధి

ఏ సమున్నత లక్ష్యాలు సాధించడానికై శ్రీవారు వ్యాసాశ్రమం స్థాపించారో, ఆ లక్ష్యాలన్నీ తమ జీవితకాలంలో సాధింపబడ్డాయన్న తృప్తి చివరి దినాలలో వారి వదనంపై తాండవిస్తూ వుండేది. సాంఘికంగానూ, ఆధ్యాత్మికంగానూ వెనుకబడిన స్త్రీలూ, ద్విజేతరులూ పురోగతి పొందడం చూచి స్వామి ఎంతో సంతోషించారు. వారి శిక్షణలో విద్యావతులైన మహిళలెందరో వేదికలెక్కి వేదాంత ప్రసంగాలు చేయసాగారు. ద్విజేతరులు సంస్కృతంలో నిష్ణాతులై ఆచార్య పీఠాలు అధిష్ఠించారు. 'యథార్థభారతి' సందేశాలు నలుమూలలా ప్రాకాయి. ఆశ్రమ గ్రంథాలు మారు మూలల గూడా ప్రత్యక్ష మయ్యాయి. సనాతన వేదాంత సభలు అనన్య సామాన్యమైన ఆధ్యాత్మిక చైతన్యం పురి కొల్పాయి. ఆశ్రమానికి అనుబంధమైన సంస్థలు నూటయేబదికి పైగా అన్ని ప్రాంతాలలోనూ విస్తరిల్లాయి. ఈ శతాబ్దం మొదటి పాదంలో స్థితి ఎలా వుండేదో పరిశీలిస్తే ఈ పరిణామాలు ఎంత విప్లవాత్మకాలో బోధపడుతుంది.

"పరమాత్మ ఏ కార్యాలు చేయడానికి మమ్ము ఈ లోకానికి పంపారో, ఆ పనులన్నీ నెరవేరాయి" అని స్వామి తుది సంవత్సరాలలో భక్తులకు చెప్పేవారు. శ్రీవారి సంస్కరణ విధానం గిట్టనివారు కొందరు అనేక విధాల వారిని నిందిస్తూ వచ్చారు. వారిలో అనేకులు తాము పొరబడ్డామని తరువాత నొచ్చుకున్నారు.

శ్రీవారి ఉద్యమం లోకాని కెలా ఉపకరించిందో దెలియజేస్తూ శ్రీపిడపర్తి వేంకటరామశాస్త్రి గారు వ్రాసిన మాటలు ఇక్కడ స్మరింపదగి వున్నాయి.

"శ్రీస్వామివారు ఆంధ్రుల కొనర్చిన సేవ అపారము. ప్రాంత జాతి మత లింగ భేదములను పాటింపక సద్భావ సందేశమును ప్రజలకందించిన వారి జీవితము భావైక్యమునకు పాటువడుచున్న భారతావనికి ఆదర్శము. శ్రీస్వామివారి ధర్మసందేశములు సంఘమున కంతులేని మేలొనగూర్చినవి. సంఘమున కృత్రిమముగా నిల్చియున్న గోడలు పడిపోయినవి. నిరపాయకరముగా పడిపోయినవి. మతరంగమున నిట్టి విప్లవములకు భారతదేశమే స్థానము".

36వ సనాతన వేదాంత సభ 1962 మార్చిలో షాద్‌నగర్‌లో ఏర్పాటయింది. డా॥ వి. రామాచారిగారు, వారి అనుయాయులు చాలా శ్రద్ధతో సభకు అన్ని ఏర్పాట్లూ దేశారు. ఆరోగ్యం తృప్తికరంగా లేకున్నా స్వామి సభకు హాజరయ్యారు. ధ్యానం, ముముక్షు కర్తవ్యం, భారతీయ సంస్కృతిలో స్త్రీలకు గల స్థానం మొదలైన విషయాలపై మృదుమధురమైన శైలిలో ఉపన్యసించారు. సభానంతరం కొంతకాలం తెలంగాణాలో పర్యటించి తుదకు పెనమలూరులో పరమాత్మానందాశ్రమం చేరుకొన్నారు.

ఇంతలో ఆరోగ్య పరిస్థితి విషమించింది. వేలూరికి వెళ్ళి కొన్నాళ్లు చికిత్స చేయించుకొన్నారు. భక్తులలో ఆశ్రమానికి ఉత్తరాధికారి ఎవరు? అన్న గుసగుసలు ప్రారంభమయ్యాయి. మూర్తీభవించిన గురుభక్తి అనదగిన శ్రీ కృష్ణచరణం గారిని ఆశ్రమాధిపతిగా నియమిస్తూ గురుదేవులు వీలునామా వ్రాయించారు.

1962 జూన్ నాలుగవ తేదీన స్వామి వేలూరి నుండి వ్యాసాశ్రమం చేరుకొన్నారు. జూన్ నెల పత్రికలో భక్తులకు ఒక దివ్య సందేశం ఇస్తూ ఇలా వ్రాశారు.

"సోదరులారా! మీరు ఋషి సంతతిలోనివారు. ఇది మీరు మరచియున్నారు. ఈ సత్యమును స్మరించినచో మీ జన్మ సఫల మగును. మీరు ముక్తులు కాగలరు. అజ్ఞాన సుషుప్తి నుండి మేల్కొనుడు! తత్త్వమును గుర్తింపుడు! సదనుష్ఠానపరులు గండు! ఋషిత్వము నొందుడు!"

మహా సమాధి

ఆత్మ సామ్రాజ్యాధినేత, లోకోద్ధారకమూర్తి, ఆధ్యాత్మిక చైతన్య ప్రదాత, శుష్క వేదాంతతమోభాస్కరుడు, చరాచర సుఖాభిలాషి-మహర్షి- సద్గురు శ్రీ మలయాళ స్వాములవారు 1962 జూలై 12 వ తేదీన గురువారమునాడు శయనైకాదశీ పుణ్యదినాన అర్ధ నిశీథ సమయంలో మహాసమాధి పొందారు.

మరునాడు రేడియోలో స్వామి నిర్యాణవార్త విని దేశం నలుమూలల నుండి వేల కొలది ప్రజలు విషాదాక్రాంతులై ఆశ్రమానికి వచ్చి స్వామికి శ్రద్ధాంజలి ఘటించారు.

స్వామి భౌతికకాయం 14వ తేది సాయంకాలం పవిత్ర నిష్ఠాశ్రమ ప్రదేశంలో సమాధి కావింపబడింది. శ్రీ కృష్ణచరణం గారు శ్రీ విమలానంద స్వామిగా రూపొంది ఆశ్రమాధిపత్యం వహించారు.

28-8-1962 వ తేదీన జరిగిన శ్రీ సద్గురు స్వామి మండలారాధన మహోత్సవానికి ముప్పది వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. మహనీయు లనేకులు స్వామివారి లోక సేవలను ప్రశంసిస్తూ శ్రద్ధాంజలి సమర్పించారు.

భక్తుల సహకారంతో స్వామి భౌతికకాయానికి సమాధి జరిగినచోట అతి సుందరమైన అధిష్ఠానమందిరం నిర్మింపబడింది. 26-1-1972 తేదీన మందిరంలో శ్రీవారి శ్వేతశిలా విగ్రహం ప్రతిష్ఠింపబడింది.

[1]శైవక్షేత్రమైన శ్రీకాళహస్తికీ, వైష్ణవ క్షేత్రమైన తిరుపతికీ మధ్య సర్వమత సమన్వయాత్మకమైన సద్గురు క్షేత్రంగా వ్యాసాశ్రమం రూపుదాల్చింది.

శరణము సద్గురుదేవుడు
శరణము సర్వాత్మభావ సంపన్నుడిలన్
శరణ మసంగ మునీంద్రుడు
చరాచర సుఖాభిలాషి శరణము మనకున్.

1. శివో దక్షిణకైలాసే విష్ణుః శ్రీవేంకటాచలే ।
తయోర్మధ్యే శుభక్షేత్రే సద్గురుశ్చ ప్రతిష్ఠితః ॥